





తగ్గేదేలే!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

దట్టమైన అరణ్య ప్రాంతాల్లో వందల ఎకరాల్లో గంజాయి సాగవుతోంది. పోలీస్, ఫారెస్టు సిబ్బంది కళ్లు మూసుకొని 'కాని చ్చేస్తుండడం'తో వేల కిలోల గంజాయి మైదాన ప్రాంతాలకు తరలిపోయి యువత జీవితాలకు పొగ పెడుతోంది. గిరిజన గ్రామాల్లో యువతకు ఇదే లాభసాటి ఉపాధి మార్గంగా మారి పోయింది. గత ప్రభుత్వం గిరిజన యువతకు ప్రత్యామ్నాయ ఉపాధిపై శ్రద్ధ చూపగా..వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారి జీవితాలు పొగసూరిపోతున్నాయి. దళారులు, ప్రభుత్వాధికారులు మామూళ్లతో ఎంజాయ్ చేస్తుంటే.. పూట గడవడం కోసం చట్టానికి వ్యతిరేకంగా వెళ్తున్న గిరిజనం జైళ్లలో మగ్గిపోతున్నారు.ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన గంజాయి పొగ.. ఇప్పుడు పల్లెల్లో సైతం గుప్‌మంటోంది. గంజాయి విషయంలో యంత్రాంగం చెబుతున్న మాటలు చూస్తే తులసి వనానికి గంజాయి చేనుకు ఉన్నంత తేడా కనిపిస్తోంది. కాకినాడకు చెందిన కానిస్టేబుళ్లు ఏకంగా గంజాయి రవాణాకు ఉపక్రమించారంటే వ్యాపారం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. వారిని తెలంగాణ పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకోవడంతో విషయం బయటకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం కూడా గంజాయి విషయంలో ఇటు ఏపీపైనే ఎక్కువగా దృష్టి సారించినట్లు కనబడుతోంది. ఏదేమైనా ఈ నాలుగున్నరేళ్లలో ఏపీ తూర్పు మన్యం, ఏవోబీ ప్రాంతం గంజాయి హబ్‌గా మారిపోయిందనే అపవాదు ఉంది. గంజాయి మత్తుకు యువత, విద్యార్థుల జీవితాలు నిర్వీర్యం అవుతుండగా ఆరోగ్యం అడుగంటిపోతోంది.

ఏజెన్సీ నుంచి వచ్చేదిలా..

ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని మంచంగిపుట్ట, పాడేరు,అరకు, చింతపల్లి, పెదబయలు, జి.మాడుగుల, హుకుంపేట, సీలేరు తదితర మండలాల్లోని దాదాపు 50 పంచాయతీల పరిధిలో 200 వరకూ మారుమూల గ్రామాల్లో సాగు చేస్తున్న గంజాయి 25 వేల ఎకరాల పైమాటే. మొత్తం మీద ఆ మన్యంలో రూ.2 వేల కోట్ల వరకూ ఏడాదికి వ్యాపారం జరుగుతుందని అంచనా. స్థానికంగా గ్రామాల్లో కిలో రూ.2 వేల నుంచి ప్రారంభమవుతుంది. నాణ్యతను బట్టి రేటు ఉంటుంది.పాడేరు, చింతపల్లిలో రూ.5వేలు, నర్సీపట్నంలో రూ.10 వేలు పలుకుతుంది. కొనుగోలుదారులు చెప్పిన ప్రాంతానికి చేరిస్తే దూరాన్ని బట్టి ధర ఉంటుంది. దళారులు ఆ బాధ్యతను నిర్వర్తిస్తారు.చింతపల్లి నర్సీపట్నం, తుని గుండా హైవేకు.. నర్సీపట్నం, కాకరపాడు, రాజవొమ్మంగి, ఏలేశ్వరం, ఎర్రవరం దగ్గర హైవేకు.. సీలేరు, డొంకరాయి, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరం,రాజమండ్రి.. చింతపల్లి, సీలేరు, డొంకరాయి,చింతూరు, భద్రాచలం గుండా తెలంగాణకు రవాణా చేస్తున్నారు.ఏడాది పొడవునా సర ఫరా జరుగుతోంది. సామర్లకోట,రాజమండ్రి రైల్వే స్టేషన్ల ద్వారా కూడా గంజాయిని తీసుకెళ్తున్నారు.తమిళనాడు లో ని సేలం,ఈరోడ్, కేరళ, మహారాష్ట్ర,ఢిల్లీ, హైదరాబాద్ ఎక్కువగా వెళుతోంది. తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్, కర్నా టక, ఒడిషా వంటి సుదూర ప్రాంతాలకు చేరిస్తే కిలోకి రూ.50వేలు, హైదరాబాద్‌లో అప్పగిస్తే రూ.20వేలు ముడుతుంది.

ఐదు నెలల్లోనే లక్షాధికారి..?

ఎకరా సాగుకు రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుండగా రూ.10 లక్షల వరకూ రకం, డిమాండును బట్టి ఆదాయం వస్తోంది. సంప్రదాయ పంటలు పోయి అధునాతన సాంకేతికతతో గంజాయి పండిస్తున్నారు. ఎకరాకు 500 వరకూ పాదులు పెట్టి ఒక్కో పాదులో 20 వరకూ మొక్కలు నాటతారు. వారంలో మొలకెత్తి నెలలో మొక్క దశకు వచ్చేస్తుంది. ఐదు నెలల్లో పంట చేతికొచ్చేస్తుంది. తర్వాత గంజాయిని కోసి ఆరబెడతారు. ఇళ్లలో నాణ్యత, రకం చూపించడానికి కొద్ది మొత్తంలో ఉంచి రహస్య ప్రాంతాల్లో పెద్ద మొత్తాల్లో దాస్తుంటారు. దీంతో ఏజెన్సీలో ఉండే గిరిజనేతరులుఈ సాగుపై దృష్టి సారించారు.

అడవి అడ్డా.. గంజాయి దందా

మామూళ్ల మైకంలో..

గంజాయి వేల ఎకరాల్లో సాగవుతుంటే మరి పోలీసులు, ఫారెస్టు, రెవెన్యూ శాఖలు ఏం చేస్తున్నట్టు.. అక్కడ అవి ఉండవా? అనే అనుమానం రావొచ్చు. కచ్చితంగా ఉంటాయి. అయితే గంజాయి నిర్మూలనకు ఉన్నతాధికారులు ఆపసోపాలు పడుతుంటే స్థానిక సిబ్బంది మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని విధులు నిర్వర్తిస్తుంటారు. ఏజెన్సీ మండలాల్లో బేస్ క్యాంపులు ఉంటాయి. పోలీసుల చెక్‌పోస్టులు.. అటవీ సంపద అక్రమంగా తరలిపోకుండా ఫారెస్ట్ చెక్‌పోస్టులు మండలంలో 15 వరకూ ఉంటాయి. మారేడుమిల్లి, రాజవొమ్మంగి, చింతూరు,జడ్డంగి తదితర పోలీస్ స్టేషన్లు రోడ్డు పక్కనే చూస్తుంటాయి. కానీ అరకొర తప్ప భారీ తరలింపులు వాటికి కనిపించవు. గంజాయి సాగు, రవాణా వంటి విషయాలు పోలీసు, ఫారెస్టు వాళ్లకు తెలియని తంతు కాదనే వాదనా ఉంది. గంజాయి రవాణాకు సహరిస్తున్న చింతూరు ఎస్ఐ, కానిస్టేబుల్ అరెస్ట్ అయ్యారు. పోలీసులు చూసీచూడకుండా వదిలేయడానికి 'ఒప్పందాలు' ఉంటాయని..అయితే కేసుల నిమిత్తం స్వల్ప పరిమాణంలో కొంత పట్టివ్వాలనే లోపాయి కారీ విధానాలు అమల్లో ఉంటాయని స్థానికులు చెబుతుంటారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని మారుమూల గ్రామాలు కావడంతో నక్సల్స్ ప్రభావం ఉంటుంది. అది కూడా గంజాయి సాగుకు కలిసొస్తుంది. పైగా ఒకవేళ పైఅధికారులు అడిగితే మన పరిధి కాదని,అక్కడికి వెళ్లాలంటే ఫోర్సు ఎక్కువ అవసరమని స్థానిక అధికారులు తప్పుదోవ పట్టిస్తుంటారనేది బహిరంగ రహస్యం.శాటిలైట్ ఇమేజ్‌లు ద్వారా సాగు జరగడం లేదని తెలుస్తోందని పోలీసుల ఉన్నతాధికారులు చెబుతున్నా మైదాన ప్రాంతాలకు తరలిపోతున్న వేల కిలోల గంజాయి ఆ మాటలను వెక్కిరిస్తోంది.రోజూ వాహనాల్లో లేదా వివిధ మార్గాల్లో గంజాయి తరలిపోతున్నా సమాచారం వస్తేనే స్వాధీనం చేసుకుంటుండడం మరో హాస్యాస్పదమైన విషయం.

ఉపాధి కరువై

గిరిజనోద్ధరణకు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పనిచేస్తోంది. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక గిరిజనులపై పాలకుల చిన్నచూపుతో ఉపాధి కరువైంది. గత ప్రభుత్వంలో గంజాయి సాగు ధ్వంసం నిరంతరాయంగా జరిగేది. సాగు చేస్తున్న గిరిజనులకు కౌన్సెలింగ్ చేసి జీడిమొక్కల వంటివి ఇచ్చి పెట్టుబడి సహాయం చేసేది.ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించేది.కానీ ఈ ప్రభుత్వం వచ్చాక అలాంటివి పడకేశాయి. జైలు నుంచి విడుదలైన తర్వాత గిరిజనుల ఉపాధి గురించి పట్టించుకోవడం లేదు.దాంతో తప్పని పరిస్థితుల్లో గంజాయితో బతుకీడుస్తున్నారు.సాగు చేసే ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంటుంది. అక్కడి నుంచి రోడ్ పాయిం ట్‌కి చేర్చడానికి గిరిజనులనే వినియోగిస్తారు. వారికి ఇచ్చే కూలి అతి తక్కువగా ఉంటుంది.25 నుంచి 50 కిలోల బస్తాను సుమారు 25 కిలోమీటర్లు చేరిస్తే రూ.500 నుంచి వెయ్యి వరకూ ముట్టజెబుతారు.కొండల్లోని కాలిబాటల్లో నడుస్తూ రోడ్డు పాయింట్లకు గంజాయి చేరవేస్తారు.

సెంట్రల్ జైలులోనే 600 మంది

ముగ్గురు అమాయక గిరిజన మహిళలు గంజాయితో రాజమహేంద్రవరం ఎస్ఈబీ పోలీసులకు పట్టుబడ్డారు. కనీసం వారి కాళ్లకు చెప్పులు కూడా లేవు. ఆ గంజాయిని విజయవాడలో అప్పగిస్తే రూ.2వేలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. ఇలా గంజాయి దందాలో అమాయక గిరిజనం జీవితాలు చిత్తవుతున్నాయి. ముఖ్యంగా యువత జీవితాలు నాశనమవుతున్నాయి. గంజాయిని తరలించే క్రమంలో అనుమానం రాకుండా ఉండడానికి మహిళలను రంగంలోకి దింపుతున్నారు. అమాయక గిరిజనులు పోలీసులకు పట్టుబడుతూ జైళ్లలో మగ్గిపోతున్నారు. పెట్టుబడిదారులు, స్మగ్లర్లు 'ఎందుకనో' పోలీసుల చేతికి చిక్కడం లేదు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో ఉన్న రిమాండు/శిక్షపడిన ఖైదీలు సుమారు 600 మంది ఉన్నారు. వాళ్లలో కొందరికి బెయిల్ వచ్చినా పూచీకత్తులు సమర్పించుకొనే స్తోమత లేక కటకటాల్లో మగ్గిపోతున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిబంధనల ప్రకారం సహాయం అందిస్తోంది. గిరిజనుల కోసం ఉన్న కమిషన్లు, వ్యవస్థలు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియని పరిస్థితి. ఏజెన్సీలో అత్యంత తక్కువ ధరకు దొరకడంతో స్థానికంగా వినియోగం కూడా బాగా ఎక్కువైంది.

వైసీపీ నాయకుల హవా

వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ నాయకుల అక్రమ వ్యాపా రాలకు అడ్డే లేదనేది బహిరంగ రహస్యం. గంజాయి వ్యాపారంలోనూ వారు బాగా రాణిస్తున్నారు. వైసీపీ నాయకుల బెదిరింపులు, ఆమ్యామ్యాలతో స్థానిక పోలీసులు, ఫారెస్టు సిబ్బంది రవాణాను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కొద్ది రోజుల కిందట ఓ వ్యాను దట్టమైన అటవీ ప్రాంతాన్ని దాటుకొని రోడ్డు పక్కనే ఉన్న రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లను ఎన్నో చెక్ పోస్టులను దాటుకొని దూసుకువెళ్తోంది. ఏలేశ్వరం పోలీసులు ఆ వ్యాన్‌ని ఆపి చెక్ చేశారు. ఇంకేముంది ఏకంగా 1400 కిలోల గంజాయి పట్టుబడింది.ఆరాతీస్తే ఆ గంజాయి తరలిస్తున్న వ్యక్తి రాజవొమ్మంగి సర్పంచ్‌గా పోటీ చేసిన వైసీపీ నాయకుడు. గతంలో గిరిజనం ఎక్కువగా పేకాట, మద్యానికి అలవాటు పడేవారు. ఇప్పుడు గంజాయి విరివిరిగా దొరుకుతుండడంతో వినియోగంతో పాటు ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు.

- గంజాయి మత్తు..జీవితాలు చిత్తు
- పల్లెల్లో కూడా గుప్పు గుప్పు
- అడవిలో కిలో రూ.2 వేలు
- సేలం చేరిస్తే రూ.50 వేలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- చూసిచూసి పోలీసులదీ అదే బాట
- గంజాతో చిక్కిన కాకినాడ పోలీసులు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- రెచ్చిపోతున్న స్మగ్లర్లు
- ఉపాధిలేక సాగు వైపు గిరిజనం
- గతంలో ప్రత్యామ్నాయంపై చొరవ
- ఇప్పుడు జైళ్ల పాలు చేస్తున్న ప్రభుత్వం

పోలీసులే..కళ్లు గప్పి..

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది.అక్రమ నిల్వలను పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకుంటున్నారు. అయినా సరే గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఏజెన్సీలోని నక్సల్స్ కార్యకలాపాల అదుపు, శాంతి భద్రతల కోసం ఏపీఎస్పీ బెటాలియన్‌నుంచి పలు ట్రూపులు వెళ్లి వస్తుంటాయి. ఏజెన్సీలో కిలో గంజాయి రూ.2 వేల నుంచి రూ.3 వేలకు లభించడంతో వీటిని దూర ప్రాంతానికి తీసుకెళ్లి రూ.15వేలకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. పోలీసుల ముసుగులో సులువుగా డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశంతో వీరు సెలవు పెట్టి మరీ అక్రమ గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం. గంజాయి తరలింపులో ఎక్కడెక్కడ చెక్‌పోస్టులు, తనిఖీలు ఉంటాయి, పోలీసులు కళ్లు కప్పి ఎలా తప్పించుకోవచ్చనే దానిపై వీరు పక్కా ప్రణాళికతో కొంతకాలంగా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వ్యవహారంలో ఇద్దరు పట్టుబడడంతో వీరు పైకి నిందితులుగా కనిపిస్తున్నారని,లోతుగా విచారణ నిర్వహిస్తే మరింత మంది గంజాయి అక్రమ రవాణా వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నా యని పలువురు భావిస్తున్నారు.ఎస్పీ, అదనపు కమాండెంట్ లోతుగా విచారణ నిర్వహించాలని కోరుతున్నారు.



కంచే చేను మేసింది..

ఉలిక్కిపడ్డ జిల్లా పోలీస్ యంత్రాంగం

సర్పవరం జంక్షన్/కాకినాడ క్రైం/ప్రత్తిపాడు, ఫిబ్రవరి 2: క్రమశిక్షణకు మారుపేరుగా,పోలీసు శిక్షణ, విధి నిర్వహణలో అం కితభావంతో పనిచేసే వ్యవస్థగా రాష్ట్రంలోనే ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు పేరుంది.అంతటి ఖ్యాతి ఉన్న కాకినాడ ఏపీ ఎస్పీ బెటాలియన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు 22 కిలోల గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ గురువారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసులకు అడ్డంగా దొరకడం పోలీసు వర్గాల్లో సంచలనం రేకెత్తించింది. తెలంగాణ పోలీసులు అరెస్టు చేసిన వారిలో హెడ్‌కానిస్టేబుల్ సాగర్ పట్నాయక్, కానిస్టేబుల్ శ్రీనివాస్ ఉన్నారు. వీరిని బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేసి గంజాయితో పాటు వాహనాన్ని సీజ్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చిం ది. కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో విశాఖకు చెందిన సాగర్ పట్నాయక్(2013 బ్యాచ్) హెడ్‌కానిస్టేబుల్‌గా, ప్రత్తిపాడుకు చెందిన శ్రీనివాస్ (2009) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు.ఇందులో శ్రీనివాస్ విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడం,సెలవులు తరచుగా పెట్టడంతో పలుసార్లు శాఖాపరమైన చర్యలకు గురయ్యాడు. వీరిద్దరూ డీ గ్రూప్‌లో పనిచేస్తున్నారు.వీరు మెడికల్ లీవ్ పేరుతో సెలవుపెట్టి నెలరోజులుగా విధులకు రావడం లేదు. గురువారం రాత్రి మారుతీ వాహనంలో 22కిలోల గంజాయిని 11 ప్యాకెట్లతో వెళ్తుండగా హైదరాబాద్‌లోని బాచుపల్లిలో తెలంగాణపోలీసులు పట్టుకోవడం సంచలనం రేకెత్తించింది. పప్పల శ్రీనివాస్ స్వగ్రామం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాథపురం (యుజేపురం) కావడంతో ఆ గ్రామంలో కలకలం రేగింది.

సమగ్ర విచారణకు ఆదేశం

గంజాయి అక్రమ రవాణా కేసులో పట్టుబడ్డ ఇద్దరు కానిస్టేబుల్స్‌పై సమగ్ర విచారణకు ఆదేశించాం. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. సాగర్ పట్నాయక్, శ్రీనివాస్‌లు ఇద్దరూ జనవరి 2వతేదీ నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నారు.

- ఎస్.సతీష్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ.

జగనన్నా.. ఇదేందన్నా!

- నేడు ఏలూరులో జగన్ సిద్ధం సభ

- బస్సుల కోసం బడులకు సెలవు - ఇంటర్ పరీక్ష వాయిదా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం అర్బన్ : రాష్ట్రమొక రాజ్యం.. ఆయనొక ప్రభువు అనే చందంగా పాలన సాగుతుందనడానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం ఉండదేమో. బడి, పరీక్షలు అన్నీ వారిష్టమే. ఓ నైతికత, పద్ధతి ఉండదు. జగన్ సభ ఉందంటే పచ్చని చెట్లు కొట్టేస్తారు. పాఠశాలలకు సెలవులు ఇచ్చేస్తారు. చివరికి పరీక్షలను సైతం వాయిదా వేసేస్తారు. ఏలూరులో శనివారం జగన్ సిద్ధం సభ ఏర్పాటు చేశారు. దీనికి జనాలను బలవంతంగా తరలించడానికి బస్సుల అవసరత ఉండడంతో ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించేశారు. 3న జరగాల్సిన ఇంటర్మీడియట్ పర్యావరణ విద్య పరీక్షను ఈ నెల 23కు వాయిదా వేశారు.2న పరీక్ష జరగ్గా.. జగన్ సభ కోసం 3వ తేదీ పరీక్షను అకస్మాత్తుగా వాయిదా వేశారు. సెలవు, పరీక్ష వాయి దాపై తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రశ్నించినా సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో అధికారులు మిన్నకుండిపోయారు. ఇంటర్మీడియట్ ఎన్విరాన్‌మెంటల్ పరీక్షను ఎలాంటి కారణం లేకుండా వాయిదా వేయడం సిగ్గుమాలిన పని అని దీనిపై ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా మండిపడ్డారు. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాలో సీఎం మూడుసార్లు పర్యటిస్తే ఆ మూడు రోజులు కూడా సెలవులు ఇచ్చారని, అసలు సీఎం మీటింగ్‌కు విద్యార్థులకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించడాన్ని నిరసిసూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నగర కార్యదర్శి రాఘవ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను పాతాళం లోకి నెట్టివేస్తున్నారని విమర్శించారు.కార్యక్రమంలో సాయి, నాయకులు చైతన్య, చంద్రిక, శ్రీదేవి, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వో శశిప్రియాంక సస్పెన్షన్

దేవరపల్లి, ఫిబ్రవరి 2: దేవరపల్లి మండలం యర్నగూడెం సచివాలయం వన్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ బూత్‌లెవెల్ అధికారి కే.శశిప్రియాంకను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఓటర్ల తుది జాబితాలో సక్రమంగా విధులు నిర్వహించనందుకు బీఎల్‌వో శశిప్రియాంకను సస్పెండ్ చేసినట్టు దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయానికి సస్పెండ్ ఆర్డర్‌ను జారీ చేశారు.యర్నగూడెం సచివాలయం వన్‌లో చనిపోయిన వారిని తొలగించకుండా డబుల్ ఎంట్రీలు తీయకుండా ఫైనల్ లిస్టు రావడంతో ఈ సస్పెన్షన్ చేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

37,200 మంది యువతకు ఓటు

జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 18 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న యువత మొత్తం 47,333మంది ఉన్నట్టు గుర్తించి, అందులో 37,200 మందికి ఓటు హక్కు కల్పించినట్టు జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి శుక్రవారం నిర్వహించినకలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాధవీలత పాల్గొన్నారు. జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్టు చెప్పారు.పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఇప్పటికే ఈఆర్వోలకు సూచనలు ఇచ్చినట్టు తెలిపారు.కొత్తగా అనపర్తి, నిడదవోలు ఈఆర్వోలుగా ఎం.మాధురి, రమణా నాయక్ నియమితులైనట్టు చెప్పారు.

అమానుషం

ప్రశాంత గోదావరి జిల్లాలో అశాంతి



శిరోముండనం అయిన తరువాత ఆశ



భర్త, కుమారుడితో షేక్ ఆశ(ఫైల్)

- తూర్పున రెండో శిరోముండనం కేసు
- ఏలుకోమంటే భార్యకే గుండుకొట్టాడు
- నీ దిక్కున్న చోట చెప్పుకోమని హెచ్చరిక
- పెదకొండేపూడిలో ఘటన
- కన్నీరుమున్నీరైన వివాహిత
- జిల్లాలో చర్చనీయాంశం

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన గోదావరి జిల్లాలో ఎన్నడూ లేని అశాంతి అభద్రత చోటు చేసుకుంది.. రోజురోజుకు గోదావరి జనం వికృత చేష్టలకు పాల్పడుతూ గోదావరి జిల్లాల ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారు. సీతానగరం మండలం పెదకొండేపూడిలో శుక్రవారం జరిగిన సంఘటనే ఒక ఉదాహరణ. ప్రేమించి పెళ్లాడిన భార్య తనను ఏలుకోమన్నందుకు ఒక భర్త శిరోముండనం చేసి నీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ హెచ్చరించి వెళ్లిపోయాడు. పాపం ఎవరూ లేని మహిళ పోలీసులను ఆశ్రయించింది. హైదరాబాద్‌కు చెందిన ముస్లిం యువతి షేక్ ఆశ హైదరాబాద్ ఫిల్మ్‌సిటీలో జూనియర్ ఆర్టిస్ట్‌గా ఉండగా,ఇతర సినీ యూనిట్‌లో అసి స్టెంట్‌గా పెదకొండేపూడికి చెందిన కర్రి రాంబా బు అనే అభిరామ్ ఉండేవాడు. ఇద్దరికి ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది.. అనంతరం ఇద్దరూ వివాహం చేసుకున్నారు. ఒక అబ్బాయి పుట్టాడు.ఆ తర్వాత రాంబాబు తన భార్య పిల్లాడిని వదిలేసి సొంతూరు పెదకొండేపూడి వచ్చేశాడు.తర్వాత ఆశ వచ్చినా కాపురం కుదరక పోవడంతో సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. అయినా ఇంతవరకూ పోలీసులేమీ చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఆమె స్వయంగా భర్త ఇంటికి వెళ్లింది. దీంతో భర్త, అతని తల్లిదం డ్రులు ఇంటికి తాళాలు వేసుకుని వేరేచోటికి వెళ్లి పోయారు.ఆశ గేటు తాళాలు బద్దలు కొట్టుకుని అక్కడే ఉంటుంది.ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం భర్త వచ్చి ఆమెతో గొడవ పడ్డాడు. అతను ఆమెను కింద పడేసి మెడమీద కాలు పెట్టి, టిమ్మర్‌తో ఆమెకు గుండు గీసేశాడు.ఆమె లబోదిబో మంటుండడంతో ఇరుగుపొరుగు వారు వచ్చేసరికి ఆమెను ఈడ్చుకుంటూ వచ్చి, జుట్టు అందరికీ చూపిస్తూ వెళ్లిపోయినట్టు ఓ వీడియో హల్‌చల్ చేస్తోంది.గుండు గీశాను. కేసు పెట్టుకో అని కూడా అతను హెచ్చ రిస్తున్నట్టు ఆ వీడియోలో ఉంది.

ఆమె తర్వాత తన బిడ్డను తీసుకుని పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యా దు చేసింది.సీతానగరం ఎస్ఐ రామకృష్ణ ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసి నిందితుడు అభిరా మ్ ను రిమాండ్‌కు పంపిస్తు న్నామని ఎస్ఐ చెప్పారు.

సీతానగరంలో రెండో శిరోముండనం

తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ వచ్చాక ఇది రెండో శిరోముండనం. 2020లో జూలై20న సీతానగరం మండలం మునికూడలిలో వరప్రసాద్ అనే దళిత యువకుడు ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నాడనే కారణంతో అతన్ని సీతానగరం పోలీసు స్టేషన్‌కు తీసుకుని వెళ్లి శిరోముండనం చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో రాజానగరం వైసీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిందితులకు అండగా ఉన్నట్టు దళితులు అనేక సార్లు ఆరోపించిన సంగతి తెలిసిందే.ఈ కేసు ఇంకా పరిష్కారం కాకముందే,అదే మండలంలో షేక్ ఆశకు భర్త శిరోముండనం చేశాడు. 1997లో ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో దళిత యువకులకు శిరోముండనం చేయించిన సంగతి తెలిసిందే.ఆ కేసు ఇంకా నడుస్తోంది.

హైకోర్టు సీరియస్ అయిన మర్నాడే..

1997 నాటి వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కేసు విచారణ ఆరు నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు విశాఖలోని ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టును గురువారం ఆదేశించిన సంగతి తెలిసిందే. సీతానగరం మండలం మునికూడలికి చెందిన దళిత యువకుడు వరప్రసాద్ కేసుపై కూడా హైకోర్టు గురువారం సీరియస్ అయింది. ఈ కేసును ఉపసంహరించుకోవాలని శిరోముండన నిందితులు ఆరుగురు, ఎస్ఐతో సహా హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.దీనిని హైకోర్టు కొట్టిపారేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటే ఇటువంటి చెడు సంస్కృతి ప్రబలే అవకాశం ఉండదని ,పోలీసులు నిర్లక్ష్యం, రాజకీయనేతల అండవల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

రెండు చేతులు వెనక్కి విరిచి గుండు గీసేశాడు..

రాజమహేంద్రవరం అర్బన్ : నా భర్త, మామలతో కలసి ఆ ఇంట్లో నాకు స్థానం కల్పించాలి. నా బిడ్డకు హక్కు కావాలి అని శిరోముండనం బాధితురాలు ఆశ కోరారు. మనకు గొడవలు వద్దు అని చెప్పి మా ఆయన నన్ను ఇంట్లోకి తీసుకెళ్లాడు. లోపలికి వెళ్లాక చెయ్యిపట్టుకుని లాక్కెళ్లి నడుం, మెడపై కూర్చుని, రెండు చేతులు వెనక్కి విరిచి పట్టుకుని గుండు గీసేశాడు. నేను పెళ్లి చేసుకుంటే నా పెళ్లికి అడ్డొస్తావా, నీకు తాళి కట్టానా ? సరదాగా సహజీవనం చేశాను, నువ్వు నా పెళ్లాం ఏంటి అన్నాడు. అందరూ నాకు సపోర్టు ఉన్నారు అంటూ నన్ను ఇలా చేశాడు అని రోదించింది.శిరోముండనానికి గురైన బాధితురాలు ఆశను ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులు తమ పర్యవేక్షణలోకి తీసుకుని శుక్రవారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో వైద్యసేవలు అందించారు.జీజీహెచ్‌లో వైద్యసేవలు పొందుతున్న బాధితురాలిని రాజానగరం ఎమ్మెల్యే రాజా, గణేశ్ పరామర్శించారు. జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.బాధితురాలికితోడుగా ఉంటాం అన్నారు. స్థానిక ముస్లిం నాయకులు ఆరీఫ్, ఇమామ్ మౌలానా బాధితురాలికి తోడ్పాటు అందించారు.సీతానగరం ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో జీజీహెచ్‌కు వచ్చారు. బాధితురాలిని రాజమహేంద్రవరంలోని స్టేట్‌హోంకు తరలిస్తున్నట్టు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులు వెల్లడించారు.

చివరిలో వచ్చి.. సాధించారు!

- రాజమహేంద్రవరం వైసీపీ ఎంపీ సీటు గూడూరికే
- ఆది నుంచి ఉన్న వారికి మొండిచేయి
- నాలుగన్నరేళ్లుగా ఉన్నా లెక్కచేయని వైనం
- జగన్ మార్కు రాజకీయం
- పద్మలత, చందన, విజయ్ వర్గాల్లో అసంతృప్తి
- స్పష్టత లేని మరో మూడు నియోజకవర్గాలు



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం లోక్‌సభ వైసీపీ ఇన్‌చార్జిగా డా.గూడూరి శ్రీనివాస్‌ను అధిష్ఠానం నియమించింది. ఇది మొదటి నుంచి నలుగుతున్న పేరే. వైద్యవృత్తిలో ఉన్న శ్రీనివాస్‌ను తొలుత సిటీ కోఆర్డినేటర్‌గా నియమించారు. సిటీ ఇన్‌చార్జిగా ఎంపీ మార్గాని భరత్‌ను నియమించడంతో ఆయన పరిస్థితి ఏంటని మొదట ఆయన ఆందోళన చెందారు.కానీ ఎంపీ సీటు బీసీ వర్గాలకే ఇస్తారనే స్పష్టత రావడంతో ఆయన పార్టీ పనిలోనే ఉన్నారు. ఆయనతో పాటు శెట్టిబలిజ వర్గం నుంచి డా.అనసూరి పద్మలత, పద్మశాలీవర్గం నుంచి చందన నాగేశ్వర్, యాదవ వర్గం నుంచి బర్ల విజయ టికెట్ ఆశిం చారు. వైసీపీ అధిష్ఠానం గూడూరి శ్రీనివాసనే అభ్యర్థిగా ఖరారు చేసింది. దీంతో ఆయన వర్గంలో ఆనందం వ్యక్తమవుతోంది. రూరల్ కోఆర్డినేటర్‌గా పార్టీని కష్టకాలంలో కాపాడిన చందన నాగేశ్వర్‌కు మొదట రూరల్ సీటు ఇస్తామన్నారు.కానీ మంత్రి చెల్లుబోయిన వేణును రామచంద్రపురం నుంచి ఇక్కడకు బదిలీ చేయడంతో ఆయనను ఆకస్మికంగా మెడపట్టి తోసేసినట్టు అయింది. చివరకు ఎంపీ టికెట్ వస్తుందని కొద్దిరోజులు ఊరించారు.ఇవాళ అదీ పోయింది. దీంతో ఆయన వర్గం తీవ్ర అసం తృప్తితో ఉంది. ఇక డాక్టర్ పద్మలత 2014 నుంచి టికెట్ ఆశిస్తున్నారు. అప్పట్లో ఆమె టీడీపీ టికెట్ ఆశించారు. కానీ బీజేపీతో పొత్తు వల్ల అప్ప ట్లో ఆమెకు అవకాశం దక్కలేదు.తర్వాత వైసీపీలో చేరి పనిచేశారు. ఆమెకే ఎంపీ టికెట్ ఖరారైపోయినట్టు కొద్దిరోజుల కిందట విస్తృతంగా ప్రచారం జరిగింది.చివరకు వైసీపీ మొండిచెయి చూపడంతో పద్మలత వర్గంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మరో అభ్యర్థి యాదవ వర్గం నుంచి బర్ల విజయ్ పేరును వైసీపీ అధిష్ఠానం పరిశీలించింది. జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి కూడా తనకు అవకాశం ఇస్తారని చెప్పినట్టు సోషల్ మీడి యాలో విజయ్ వర్గంప్రచారం చేసింది. ఇవాళ ఆయన వర్గం కూడా అసంతృప్తికి గురైంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉండగా, ఇప్పటికే నాలుగు అసెంబ్లీ స్థానాలు, ఎంపీ స్థానానికి అభ్యర్థులను వైసీపీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. ఇంకా అన పర్తి, రాజానగరం, నిడదవోలు స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు వైసీపీకి చెందిన వారే. ఎందువల్లనో వారి పేర్లను ఇంకా ప్రకటించకపోవడంతో, జగన్ ఎవరి కొంప ముంచుతారోననే భయం కూడా వారిలో మొదలైంది.

'సిద్ధం' చేయాల్సిందే!

కాకినాడ జిల్లాలో...

- ఏలూరులో జగన్ సిద్ధం సభకు ప్రభుత్వం అధికార దుర్వినియోగం
- నిర్వహించేది వైసీపీ సభ అయినా అధికారులు దగ్గరుండి మరీ ఏర్పాట్లు
- కాకినాడ జిల్లాలో అన్ని ప్రైవేటు కాలేజీల బస్సులు లాగేసుకున్న రవాణాశాఖ
- ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలకు సైతం బలవంత సెలవు.. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్ష రద్దు
- ఒక్కో నియోజకవర్గానికి 50 చొప్పున బస్సులు... 5 వేల జనం తరలింపు

(కాకినాడ -ఆంధ్రజ్యోతి)

సీఎం జగన్ పర్యటన అంటే ప్రజలకు రోతెక్కుతోంది. ఎక్కడికక్కడ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేయడంతోపాటు ఏకంగా కాలేజీల బస్సులు లాగేసుకోవడం, స్కూళ్లు, కాలేజీలకు బలవంతంగా సెలవులు ఇచ్చేస్తూ అధికారులు స్వామిభక్తి చాటుకుంటుండడం వివాదాస్పదమవుతోంది. అటు జగన్ పర్యటించే ప్రాంతాల్లో చెట్లు కూడా నరికేస్తుండడం, ప్రజలు ఎక్కడ తిరగబడతారోననే భయంతో రోడ్లకు ఇరువైపులా బారికేడ్లు నిర్మించడం వంటి చర్యలు తీవ్ర విమర్శలకు తావిచ్చాయి. అయినా జనం తిట్టుకుంటే మాకేంటి అనే ధోరణితో ప్రభుత్వం, అధికారులు పద్ధతి మార్చుకోకుండా అడ్డగోలుగా వ్యవహరిస్తునే ఉన్నారు. ఇప్పటివరకు కాకినాడ జిల్లాలో గడచిన రెండేళ్ల వ్యవధిలో గొల్లప్రోలు, పెద్దాపురం, కాకినాడలో సీఎం జగన్ అధికారిక పర్యటనల పేరుతో అధికారులు వ్యవహరించిన తీరు దుమారం రేపింది. అయితే ఇప్పుడు తాజాగా జిల్లాతో సంబంధం లేని జగన్ సభకు అధికారులు అన్నీ తామై వ్యవహరించడం అందరినీ ముక్కున వేలేసుకునేలా చేస్తోంది. అసలే ఎన్నికలు దగ్గర పడ్డ తరుణంలో జగన్ శనివారం ఏలూరుతో పార్టీ తరఫున సిద్ధం పేరుతో బహిరంగసభ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా కేవలం ఎన్నికల ప్రచారం కోసం నిర్వహిస్తున్న సొంత కార్యక్రమం. కానీ అధికారులు మాత్రం ప్రభుత్వం ఆదేశాలతో అన్ని రకాల వసతులు జిల్లా నుంచి సమకూర్చుతున్నారు. అందులోభాగంగా రవాణాశాఖ జిల్లావ్యాప్తంగా 42 ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల నుంచి బలవంతంగా బస్సులు లాగేసుకుంది. ఒక్క ఆదిత్య, శ్రీచైతన్య ప్రగతి తదితర ప్రముఖ కాలేజీల నుంచే వందల బస్సులను అధికారులు తీసేసుకున్నారు. మండలాల్లోని పలు స్థానిక ప్రైవేటు కాలేజీలు, స్కూళ్లను సైతం బెదిరించి బస్సులను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అలాగే శనివారం అన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలకు సైతం అధికారులు బలవంతంగా సెలవులు ఇచ్చేశారు. వాస్తవానికి జిల్లాలో శనివారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఉన్నాయి. కానీ సీఎం జగన్ సభ కోసం వీటిని రద్దు చేసేశారు. అలాగే లాక్కున్న బస్సులు ఏ మూలకూ చాలకపోవడంతో గడచిన మూడురోజులుగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేటు టూరిస్ట్ బస్సులు, మినీ బస్సులను కూడా రవాణాశాఖ అధికారులు లాగేసుకున్నారు. దీంతో ఆయా యజమానులు లబోదిబోమంటున్నారు. కాగా వైసీపీ సొంత సభకు జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి ప్రభుత్వం తరఫున అధికారులు తాము లాక్కున్న బస్సుల్లో 50 చొప్పున తరలిస్తున్నారు. సొంతంగా ఈ బస్సులు డీజిల్ కొట్టించుకుని చెప్పిన నియోజకవర్గానికి వెళ్లి జనాలను ఎక్కించుకుని ఏలూరు వెళ్లి రావాలని అధికారులు ఆయా యజమానులను బెదిరించారు. కాగా సిద్ధం సభకు జిల్లాలో ఒక్కో నియోజకవర్గం నుంచి 5 వేల మంది జనాలను తరలించాలని పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జులను వైసీపీ అధిష్ఠానం ఆదేశించింది. ప్రభుత్వం తీరుతో జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు లబోదిబోమంటున్నాయి. సీఎం వస్తున్న ప్రతిసారీ బస్సులను లాగేసుకోవడమే కాకుండా డీజిల్ ఖర్చులు కూడా తమనే భరించాలని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల కిందట గొల్లప్రోలు సభకు పంపిన బస్సులకు ఇస్తామన్న డీజిల్ డబ్బులు కూడా ఇవ్వకపోవడం, అడిగితే బెదిరిస్తుండడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో...

జగన్ సభకు 300 ఆర్టీసీ బస్సులు

- ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి కేటాయింపు
- ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు 600 పైనే లాక్కున్న వైనం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2: ముఖ్యమంత్రి ఏలూరు పర్యటన ఆర్టీసీ ప్రయాణికులకు కష్టాలు తెచ్చిపెట్టనుంది. శనివారం జరిగే సీఎం సభ కోసం జనాలను తరలించడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఏలూరు పంపిస్తుండగా, వీటిలో పల్లెవెలుగు బస్సులే అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. దీంతో పల్లె ప్రజానీకం ప్రయాణ అవసరాల కోసం నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యమంత్రి సభకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 300కు పైగా ఆర్టీసీ బస్సులను ఏలూరు పంపిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి 90కి పైగా బస్సులు ఏర్పాటుచేశారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం బస్సులు దాదాపుగా 300 వరకూ ఉన్నాయి. వీటిలో 90కి పైగా బస్సులు ఏలూరు పంపడంతో ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు. అలాగే కాకినాడ జిల్లా నుంచి సుమారు 90, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి 100కి పైగా బస్సులు ఏలూరు సీఎం సభకు పంపిస్తున్నారు. ఇలా పెద్ద సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేయాల్సి రావడంతో ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు కూడా...

ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను భారీ సంఖ్యలో సీఎం సభకు తరలించడానికి సిద్ధం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రముఖ ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన సుమారు 600కు పైగా బస్సులు చలో ఏలూరు నడుపుతున్నారని చెబుతున్నారు. దీంతో సీఎం సభ అంటేనే అటు ఆర్టీసీ అధికారులు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటుండగా, ఇటు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

నేటి ఇంటర్ పరీక్ష వాయిదా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శనివారం జరగాల్సిన ఇంటర్ మొదటి ఏడాది పర్యావరణ విద్య పరీక్షను ఈనెల 23న నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్ఎస్‌వీఎల్ నరశింహం తెలిపారు. కాగా 2న జరిగిన నైతికత మానవీయ విలువలు పరీక్షకు 21,195 మంది హాజరుకాగా 168 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 5 నుంచి 20 వరకూ.. జనరల్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ఈ నెల 11 నుంచి 20 వరకూ ప్రాక్టికల్స్ పరీక్షలు 76 సెంటర్లలో జరుగుతాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని.. విద్యార్థులు అందరూ తమ సెషన్లలో హాజరుకావాలని ఇంటర్ బోర్డు జోన్-1, 2 ఆర్జేడీ ఐ.శారద ఒక ప్రకటనలో కోరారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో...

స్కూళ్ల యాజమాన్యాలకు చేతి'చమురు'

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఏలూరు జిల్లా దెందులూరులో వైసీపీ నిర్వహించే 'సిద్ధం' సభ కోసం భారీగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీపరంగా జరిగే సిద్ధం సభ కోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని అమలాపురం, రావులపాలెం, రామచంద్రపురం, రాజోలు డిపోల పరిధిలో 110 ఆర్టీసీ బస్సులను సభ కోసం సిద్ధం చేశారు. వీటిని నియోజకవర్గాల వారీగా 20 నుంచి 30 బస్సుల వంతున కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు కేటాయించారు. ఇవికాకుండా ఆయా నియోజకవర్గాల పరిధిలో ఇంజనీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలలతోపాటు వివిధ ప్రైవేటు స్కూళ్ల బస్సులను రవాణాశాఖ అధికారుల ఒత్తిడితో సిద్ధం చేశారు. రాజోలు నియోజకవర్గంలో ప్రైవేటు స్కూలు బస్సులకు ఆయిల్ కొట్టి పంపించాలని వైసీపీ నేతలు స్కూలు యాజమాన్యాలను ఆదేశించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈమేరకు సోషల్ మీడియాలో జనసేన, టీడీపీ నేతలు ప్రచారాస్త్రాలు సంధించారు. ఇక స్కూళ్లు, కళాశాలలకు కొన్నింటికి సెలవులు ఇచ్చారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్‌కు సంబంధించి ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఆయా కళాశాలల బస్సులను వైసీపీ సభ కోసం తరలించడం వల్ల పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. నియోజకవర్గాల వారీగా సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక గ్యాలరీలు కేటాయించడంతో కచ్చితంగా పార్టీ శ్రేణులను అక్కడికి తరలించి ఆ ప్రాంగణాలను నింపుకోవడం ద్వారా బల ప్రదర్శనలో ముందంజలో ఉన్నారని పార్టీ నేతలు భావిస్తున్నారు. అందుకు తగిన రీతిలో ఎక్కడికక్కడే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉదాహరణకు కొత్తపేట నియోజకవర్గ పరిధిలో 35 ఆర్టీసీ, మరో 40 వరకు స్కూలు బస్సుల ద్వారా జనాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులను జిల్లా వ్యాప్తంగా 110 సర్వీసులను ఒక్కసారిగా రద్దు చేయడం వల్ల ప్రయాణికులను ప్రైవేటు స్కూలు బస్సులను విద్యార్థులు సైతం ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. అయినా సరే అధికార యంత్రాంగం అటు బస్సులు సమకూర్చడం నుంచి ఇటు జన సమీకరణ వరకు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల విద్యార్థులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బస్సుల్లోనే బిర్యానీ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లను సిద్ధం చేసుకుంటున్నారు.



నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్‌కు ఊరట

బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయింపు.. రైల్వే మూడు వంతెనల పనులన్నీ పూర్తయ్యే అవకాశం

నరసాపురం, ఫిబ్రవరి 2: కేంద్రం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు పెద్ద ఊరట లభించింది. గత కొంత కాలంగా నిధులు లేక నిలిచిన కోటిపల్లి రైల్వే లైన్ పనులకు రూ.300 కోట్లు కేటాయించారు. దీంతో పనులు మళ్లీ ఊపందుకోనున్నాయి. కోటిపల్లి - నరసాపురం రైల్వే ప్రతిపాదన బ్రిటిష్ హాయం నుంచి ఉంది. అయితే 2000వ సంవత్సరం నుంచి ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా ప్రతి బడ్జెట్‌లోనూ సర్వేకు మాత్రమే నిధులిస్తూ రైల్వేశాఖ చేతులుదులుపుకుంటూ వచ్చింది. అయితే రాష్ట్ర విభజన తరువాత కేంద్రం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఒత్తిడితో కేంద్రం ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. సుమారు 57 కిలోమీటర్ల మేర చేపట్టే కొత్త రైల్వే లైన్ నిర్మాణ పనులకు రూ.2120 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతాన్ని వ్యయాన్ని భరించాల్సి ఉంది. ఈ మేరకు రైల్వే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.1150 కోట్లు కేటాయించింది. దీనిలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.350 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. దీంతో గత కొంతకాలంగా పనులు నిలిచిపోయాయి. రైల్వే అధికారులు స్వయంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కలిసి నిధులు విడుదల చేయాలని విన్నవించారు. అయినా స్పందన లేదు. దీంతో బడ్జెట్‌పైనే ఆధారపడ్డారు. ఇప్పటివరకు కేంద్రం ప్రతి బడ్జెట్‌లోనూ ఈ ప్రాజెక్టుకు నిధులిస్తూ వచ్చింది. మొదటి బడ్జెట్‌లో రూ.450 కోట్లు ఇచ్చిన కేంద్రం, గత ఏడాది రూ.100 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెండింగ్ నిధులు ఇవ్వకపోవడంతో పనులు పెండింగ్ పడ్డాయి. ఈ కొత్త రైల్వే ప్రాజెక్టులో గోదావరిపై మూడు చోట్ల వంతెనలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే కోటిపల్లి వంతెన పనులు పూర్తయ్యాయి. పాచర్లపూడి, చించినాడ వద్ద వంతెన పనులు 60 శాతం మాత్రమే అయ్యాయి. ఇటు భూసేకరణ కూడా 80 శాతం వరకు పూర్తయింది. వంతెన నిర్మాణాలు పూర్తయితే కొత్త ట్రాక్ పనులే మిగులుతాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రాజెక్టు 2021 నాటికి పూర్తి కావాల్సి ఉంది. అయితే నిధుల కొరత, కొవిడ్ కారణంగా ముందుకు సాగలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిపెట్టలేదు. ప్రస్తుతం ఓటాన్ బడ్జెట్‌లో కేంద్రం ఈ ప్రాజెక్టుకు పెద్దపీట వేయడంతో గౌతమి, వైనాత్తేయి, వశిష్ఠా నదులపై పెండింగ్ వంతెన్ల పనులు వేగవంతం కానున్నాయి. ఇటు బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.




కళాశాల చైర్‌పర్సన్ నాగమణిని దుశ్శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం

దంత సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం

డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్ కుమార్‌రెడ్డి.. కేఎల్ఆర్ లెనోరా దంతవైద్య కళాశాలలో రాష్ట్ర సదస్సు

రాజానగరం, ఫిబ్రవరి2: దంతాలను సంరక్షించుకోవడం ద్వారా ప్రతి మనిషికి సంపూర్ణ శరీర ఆరోగ్యం చేకూరుతుందని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇండియన్ ప్రోస్థొడాంటిక్ సొసైటీ (కృత్రిమ దంతాల విభాగం) ఏపీ శాఖ ఆధ్వర్యంలో రాజానగరంలోని కేఎల్ఆర్ లెనోరా దంతవైద్య కళాశాలలో రెండు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపూర్ణ శరీర ఆరోగ్యానికి ఆరోగ్యకరమైన దంతాల దోహదపడతాయన్నారు. సదస్సులో ప్రపంచ, జాతీయ స్థాయి నిష్ణాతులైన వైద్య నిపుణులు దంత వైద్య రంగంలో వస్తున్న ఆధునిక వైద్య విధానాలు, చికిత్సా పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే 65 సైంటిఫిక్ పేపర్లను ఫ్యాకల్టీ మెంబర్లు, పీజీ విద్యార్థులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కేఎల్ఆర్ గ్రూపు విద్యాసంస్థల అధినేత్రి నాగమణి, కార్యదర్శి వై.మధుసూదనరెడ్డి, ఐపీఎస్ కార్యదర్శి డాక్టర జంగాల హరి, సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఐపీఎస్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్, కార్యదర్శి డాక్టర్ శేషారెడ్డి, లెనోరా దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వప్రకాష్‌శెట్టి, సదస్సు నిర్వాహకులు టీఎస్‌వీ సత్యనారాయణ, డాక్టర్ సుధీర్ కొండక, వివిధ రాష్ట్రాలకు చెందిన 215 మందికి పైగా ప్రోస్థొడాంటిక్ నిపుణులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారిపై పిచ్చికుక్క దాడి



రంగంపేట, ఫిబ్రవరి, 2: మండలంలోని వెంకటాపురంలో ఏడాదిన్నర వయసున్న బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసింది. బీసీ కాలనీకి చెందిన శీలం శ్రీను కుమారుడు హర్షవర్ధన్ శుక్రవారం ఉదయం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. ఆ కుక్కను వెంటనే గ్రామస్తులు చంపేశారు. బాలుడిని చికిత్స నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా గ్రామంలో కుక్కలు అధిక సంఖ్యలో తిరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను అదుపు చేయాలని కోరుతున్నారు.



కరగపాడు ప్రాంతంలో పెద్దపులి జాడ కోసం అమర్చిన సీసీ కెమెరాలు

కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో పెద్దపులి

గోపాలపురం, ఫిబ్రవరి 2: పెద్దపులి సంచారంతో మండల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. రెండురోజులుగా గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామశివారులోని గాడిచెరువులో ప్రవేశించిన పులి గురువారం సాయంత్రానికి జాతీయ రహదారిని అనుకుని ఉన్న మాతంగమ్మ మెట్ట వద్దకు చేరుకుని అర్ధరాత్రి జాతీయ రహదారి దాటి ఉదయానికి సుమారు 5 కిలోమీటర్ల మేర ప్రయాణించి కరగపాడు శివారులో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌కు చేరుకున్నట్టు తూర్పుగోదావరి జిల్లా అటవీశాఖాధికారి ఎల్.ధనరాజు తెలిపారు. ఐదు కిలోమీటర్లు ప్రయాణించి అలసట చెందిన పులి ప్రస్తుతం కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో విశ్రాంతి తీసుకుంటున్నట్టు తెలిపారు. దీని జాడలు పసిగట్టేందుకు ప్రస్తుతం టైగర్‌టీమ్ పులిని వెంబడిస్తోందని, ఇక్కడ నుంచి పులి పాపికొండల వైపు ప్రయాణించే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

తాడిపూడిలో కనిపించినది పులా... పిల్లా..



మొక్కజొన్న తోట వద్ద పులి సంచారం

తాళ్లపూడి, ఫిబ్రవరి 2: పెద్దపులి తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలోని గోదావరి తీరంలో కనబడిందన్న విషయం సంచలనమైంది. కాగా శుక్రవారం మరోసారి అదే ప్రాంతంలోని మొక్కజొన్న తోట వద్ద సంచరించడం ఇసుక రీచ్‌లో పనిచేసే సిబ్బంది కంటపడింది. అయితే అది పులి కాదని, అడవి పిల్లి అని కొందరు చెబుతున్నారు. అది ఏ జంతువో తేల్చి చెప్పాల్సింది ఫారెస్టు అధికారులే. రీచ్ వద్ద పనిచేసే సిబ్బంది భయంతో వణికిపోతున్నారు.







గుడిసెలను కూల్చుతున్న బుల్డోజర్.. అధికారులకు సూచనలిస్తున్న ఏఎస్పీ

లక్ష్మీదేవిపేటలో 600 గుడిసెలు కూల్చివేత

- హైకోర్టు ఉత్తర్వులతో తొలగించిన రెవెన్యూ, పోలీసులు
- రెండేళ్ల కిందట రెండుచోట్ల 70 ఎకరాల భూమిలో గుడిసెల ఏర్పాటు

ఎటపాక, ఫిబ్రవరి 2: మండల కేంద్రమైన ఎటపాకలోని లక్ష్మీదేవిపేట రెవెన్యూ విలేజ్ పరిధిలో రెండుచోట్ల గత రెండేళ్ల కిందట ఆదివాసీలు నివాసం ఏర్పరుచుకున్న గుడిసెలు, రేకుల షెడ్లను శుక్రవారం తెల్లవారుజామున పోలీసు, రెవెన్యూ సంయుక్త ఆధ్వర్యంలో గుడిసెల తొలగింపు ఆపరేషన్‌ను నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వులు, అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తెల్లవారుజామున 3 గంటల సమయంలో బుల్డోజర్లతో పోలీసు బలగాలు అక్కడ చేరుకున్నాయి. గుడిసెల్లో ఆదివాసీలు నిద్రిస్తున్న సమయంలో, ఇంట్లోని సామగ్రిని ఖాళీ చేయించి, అనంతరం బుల్డోజర్లతో గుడిసెలు, రేకులషెడ్లను నేలమట్టం చేశారు. రెండేళ్ల కిందట విలీన మండలాలకు చెందిన ఆదివాసీలతోపాటు తెలంగాణలోని భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన ఆదివాసీలు ఇక్కడ భూమిని ఆక్రమించి గుడిసెలను ఏర్పాటు చేసుకున్నారు. గత రెండేళ్ల నుంచి ఈ గుడిసెల్లోనే నివాసముంటున్నారు. అయితే ఈ భూమిపై అన్ని హక్కులు ఉన్నాయంటూ కొందరు కొన్ని నెలల కిందట హక్కు పత్రాలతో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దాంతో భూమి గల యాజమానులకు అనుకూలంగా న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేయడంతో ఇటీవల రెండుసార్లు రెవెన్యూ అధికారులు ఆ భూముల్లో గుడిసెలు ఏర్పాటుచేసుకున్న ఆదివాసీలకు నోటీసులు కూడా అందజేశారని, అయినా స్పందించలేదని తహశీల్దార్ పృథ్వీ తెలిపారు. న్యాయస్థానం ఉత్తర్వులతో లక్ష్మీదేవిపేటలోని రెండుచోట్ల 70 ఎకరాల భూమిలోని 600 గుడిసెలు, రేకుల షెడ్లను కూల్చివేశారు. అయితే ఈ రెండుచోట్ల గుడిసెలు వేసిన వారిలో తెలంగాణకు చెందిన ఆదివాసీలు కూడా ఉన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా బలవంతంగా గుడిసెలు కూల్చారని ఆదివాసీ మహిళలు పేర్కొంటున్నారు. ఈ భూమి తమకే చెందుతుందని, 2 సెంట్ల భూమికి తమ వద్ద నుంచి గిరిజన సంఘాల నాయకులు కొందరు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారని గుడిసెల ఏర్పాటుచేసుకున్న ఆదివాసీ పేర్కొంటున్నారు. గుడిసెలు వేసుకున్నచోట విద్యుత్, రహదారులు, డ్రైనేజీ కూడా నిర్మించి ఇస్తారని చెప్పారని తెలిపారు. అయితే గుడిసెల తొలగింపు సమయంలో ఆ ప్రాంతంలో భారీగా పోలీసు బలగాలు మోహరించారు. డాక్టర్ పాలరాజ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో లక్ష్మీదేవిపేటలో 100 గుడిసెలు, లక్ష్మీదేవిపేటలో మరో ప్రాంతంలో 500 గుడిసెలను కూల్చివేశారు. గుడిసెల తొలగింపు కార్యక్రమం ముగిశాక చింతూరు ఏఎస్పీ రాహూల్‌మీనా ఆ ప్రాంతంకు వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గొడవలు, ఆందోళనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఎన్నికల బదిలీల్లో మంత్రి విశ్వరూప్ బంధుప్రీతి

- అధికార పార్టీకి ప్రయోజనం చేకూర్చేలా పోస్టింగులు
- కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన హరీష్‌మాధుర్

అమలాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగే బదిలీల్లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ బంధుప్రీతి ప్రదర్శించడంతోపాటు అధికార పార్టీకి ప్రయోజనం చేకూర్చేలా భార్యాభర్తలకు పోస్టింగులు ఇచ్చారంటూ కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు శుక్రవారం టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మంత్రి విశ్వరూప్ సమీప బంధువులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రాధాన్యతా పోస్టులు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రస్తుతం అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న జనుపల్లి స్వర్ణను ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ అమలాపురం తహసీల్దారు కార్యాలయానికి బదిలీచేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె మంత్రి విశ్వరూప్‌కు స్వయానా మేనకోడలు. ఉప్పలగుప్తం ఎస్ఐగా మొన్నటివరకు పనిచేసిన జి.వెంకటేశ్వరరావుకు సోషల్ మీడియా విభాగం సీఐగా పదోన్నతి కల్పించి అమలాపురం ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారని, వీరిద్దరూ భార్యభర్తలని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఇటువంటి నియామకాలు చేపట్టడం వల్ల పారదర్శకత లోపిస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘంతోపాటు ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పురోహితుల క్రికెట్ లీగ్‌ను ప్రభుత్వం గుర్తించేలా కృషి

రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్.. ముగిసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్

అంబాజీపేట, ఫిబ్రవరి 2: సమాజంలో మంచి గుర్తింపు ఉండి నిత్యం వేదపఠనం, పూజలు, యజ్ఞయాగాదులతో బిజీగా ఉండే పురోహితుల్లో ఉండే నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పురోహితుల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు టీకే విశ్వనాథ్ టాస్ వేశారు. మ్యాచ్‌లో కొవ్వూరు, కాకినాడ జట్ల మధ్య హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో 8 పరుగులు తేడాతో కాకినాడ జట్టు విజయం సాధించింది. విన్నర్స్‌గా కాకినాడ జట్టు నిలవగా కొవ్వూరు జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఉపద్రష్ట నాగాదిత్య అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్, విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్, విష్ణువర్ధన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పురోహితుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రభుత్వం నిర్వహించేవిధంగా సీఎం జగన్‌తో మాట్లాడ్డం జరుగుతుందని వివరించారు. ప్రతిఏటా పురోహితుల రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించుకునేందుకు సీఎస్ఆర్ నిధులు రూ.5 లక్షలు అందించడం జరుగుతుందని మంత్రి విశ్వరూప్ హామీ ఇచ్చారు. అనంతరం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లను మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌కు వివరించారు. తొలుత టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్ సెమిఫైనల్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం జరిగిన సభలో కాకినాడ జట్టుకు విన్నర్స్‌గా ప్రకటించి రూ.50 వేల చెక్కు ట్రోఫీని అందించగా, కొవ్వూరు జట్టుకు రన్నర్స్ కప్, రూ.30 వేల చెక్కును అందించారు. అలాగే సెమిఫైనల్స్‌కు వచ్చిన కాకినాడ, కొవ్వూరు, విజయవాడ, ఖమ్మం జట్లుకు రూ.10 వేల వంతున నగదును అందించారు. అలాగే బెస్ట్‌బ్యాట్స్‌మెన్, బౌలర్, మ్యాన్‌ఆఫ్ ది సిరీస్, పెయిర్ ఆఫ్ ప్లేయర్‌కు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు పి.రఘురామ్, రాష్ట్ర పురోహిత సంఘం గౌరవాధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, గణపతి వీరరాఘవులు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, బొంతు పెదబాబు, పేరి శ్రీను, దొమ్మేటి సత్యమోహన్, నిర్వాహకులు ఉపద్రష్ట విజయ్, కర్రా బాబి, అక్షయ్, మహేంద్ర పాల్గొన్నారు.

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.35,76,652



బాలబాలాజీ హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, ఫిబ్రవరి 2: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి హుండీ ఆదాయం రూ.35,76,652 వచ్చినట్టు సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. 64 రోజులకుగాను హుండీ లెక్కింపును శుక్రవారం నిర్వహించగా నగదుతోపాటు 14 గ్రాముల బంగారం, 143 గ్రాముల వెండి వచ్చిందని ఏసీ తెలిపారు. హుండీ లెక్కింపు అమలాపురం ఆలయాల తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ గెడ్డం కృష్ణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.



రూ.లక్ష విరాళమందిస్తున్న మద్దినేని దంపతులు

సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది, ఫిబ్రవరి 2: అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో స్వామి దర్శనం అనంతరం స్వామివారి నారసింహ సుదర్శన హోమానికి శాశ్వత విరాళం కింద విజయవాడకు చెందిన మద్దినేని రామకిషన్-లక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు. విరాళమందించిన దాతలకు ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, ఆలయ సిబ్బంది సత్యకిరణ్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

అరెస్టు చేసినా ఆందోళన ఆగదు : మల్లాడి

యానాం, ఫిబ్రవరి 2: యానాం మత్స్యకారులకు సంబంధించి నష్ట పరిహారం విషయంలో మత్స్యకారుల తరుఫున పోరాడుతున్న తనను అరెస్టు చేసినా పోరాటం ఆగదని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మత్స్యకార నాయకుడు మల్లాడి కృష్ణారావు అన్నారు. యానాం శివారు దరియాలతిప్ప-గిరియాంపేట రోడ్డులో ఉన్న ఓఎన్జీసీ చమురు సంస్థ సమీపంలో యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమసంఘ నేతృత్వంలో ఈ మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులను ఉద్దేశించి మల్లాడి మాట్లాడారు. చమురు సంస్థల ద్వారా సీఎస్ఆర్ తీసుకువచ్చింది తనే అని గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్ నుంచి ఓఎన్జీసీ మారిన అంశాలతోపాటు అప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను వివరించారు. ముఖ్యంగా మత్స్యకారులకు చమురు సంస్థ ఇవ్వాల్సిన నష్టపరిహారం కాలయాపన చేయకుండా తక్షణమే విడుదల చేయాలన్నారు. ఇప్పటికే పుదుచ్చేరి ప్రభుత్వం అర్హులైన మత్స్యకారుల జాబితాలో ఇచ్చిన నివేదిక ఆధారంగా 5462మందికి 24నెలలకు 11,500 చెప్పున పరిహారం అందించాలన్నారు. ఇప్పటికైనా చమురు సంస్థ స్పందించి నగదును పుదుచ్చేరి ప్రభుత్వఖాతాలో జమచేయాలని లేకుంటే మరో రెండు మూడు రోజుల్లో మారో సమావేశం నిర్వహించి ఈ ధర్నాను ఉధృతం చేస్తామన్నారు. నష్టపరిహారం నగదును ప్రభుత్వం ఇవ్వకుంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని ఇప్పటికే ఈ నిర్ణయం సంఘం తీసుకున్న విషయాన్ని మల్లాడి తెలిపారు. పెద్దఎత్తున మత్స్యకారులు తరలిరావడంతో మూడురోడ్ల కూడలి జనసంద్రంగా మారింది. అనంతరం మల్లాడి కాకినాడలోని ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అదేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఏజెన్సీ సమాచారం

లోయరు సీలేరులో ఎస్సీ కమిషన్ పర్యటన



ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్‌తో సీఈ బొడ్డు శ్రీధర్, ప్లాంట్ మేనేజర్ బాలకృష్ణ

మోతుగూడెం,ఫిబ్రవరి2: లోయర్ సీలేరు ప్రాంతంలో ఉన్న ఏపీ జెన్‌కో సీఈ కార్యాలయాన్ని ఎస్సీ కమిషన్ చైర్మన్ మురముడి విక్టర్ ప్రసాద్ పరిశీలించారు. ఆయనకు సీఈ బొడ్డు శ్రీధర్, ఎస్ఈ వెంకటేశ్వర రావు, మేనేజర్ భీమవరం బాల కృష్ణ, ఈఈ వర ప్రసాద్, ఏఎస్‌వో సూర్య మోహనరావు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పొల్లూరు జల విద్యుత్‌కేంద్రం, జలపాతం, ఫోర్ బై డ్యాంను సందర్శించారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేత నరసింహ, ఉపేంద్ర ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి శాలువా కప్పారు. కార్యక్రమంలో వేమగిరి కిరణ్ సతీష్, రాఘవన్, బాబు, నాగిరెడ్డి నాగేశ్వరరావు,ధార బాబు, కొట్టు శ్రీనివాసరావు, జి. రవి, సెల్వ రాజు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం తహశీల్దార్‌గా నాగరాజు

వై.రామవరం, ఫిబ్రవరి 2: వై.రామవరం తహశీల్దార్‌గా ఎన్.నాగరాజును నియమించినట్టు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన్ను పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం నుంచి ఇక్కడకు బదిలీ చేశారు. ఇంకా ఆయన విధుల్లోకి చేరాల్సి ఉంది. ఇప్పటి వరకు పనిచేసిన తహశీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలానికి బదిలీ అయ్యారు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

వై.రామవరం, ఫిబ్రవరి2: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓట్లు వేసే విధాన ప్రక్రియపై శుక్రవారం వై.రామవరంలో ఓటర్లకు డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జడ్పీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసే విధానంపై ఓటర్లకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ తాతారెడ్డి, వీఆర్వో వీఆర్ఏ, బీఎల్వోలు పాల్గొన్నారు.

1104 యూనియన్ కార్యవర్గం ఎన్నిక

మోతుగూడెం, ఫిబ్రవరి2: చింతూరు మండలం మోతుగూడెం 1104 యూనియన్ శాఖ కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఎన్నికల రీజనల్ అధ్యక్షుడు వై.సత్తిబాబు అధ్యక్షతన, రీజనల్ సెక్రటరీ వి.కిరణ్ సమక్షంలో మోతుగూడెం 1104 యూనియన్ ఆఫీస్‌లో నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడానికి సభ్యులు సహకరించారు. బ్రాంచ్ అధ్యక్షుడిగా గుగులోత్ రవి, కార్యదర్శిగా కొట్టు శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సెల్వరాజ్, కోశాధికారిగా గోవింద్‌రాజ్, ఉపాధ్యక్షులుగా టి.త్రినాథ్‌రావు, డి.భారతి, సంయుక్త కార్యదర్శిగా కె.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సెక్రటరీగా కుమారి, పి.పూర్ణిమ, పబ్లిసిటీ సెక్రటరీగా రామారావు, అదనపు కార్యదర్శిగా కె.రాజేష్ ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో సీలేరు, డొంకరాయి బ్రాంచ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

రంపచోడవరం, ఫిబ్రవరి 2: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా మంజూరైన ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఐటీడీఏ ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఏవో డీఎన్‌వీ రమణ శుక్రవారం పంపిణీ చేశారు. రెండో విడతలో 50 మందికి మంజూరైనట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం.. ఆంధ్రాలో నియోజకవర్గ ఆటగాళ్లు ప్రతిభ

రంపచోడవరం, ఫిబ్రవరి 2: ఆడుదాం.. ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలలో నియోజకవర్గ ఆటగాళ్లు విజయ దుందుభి మోగించినట్టు నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కంగల పోతురాజు తెలిపారు. కబడ్డీలో మెన్ విన్నర్, ఖోఖోలో మెన్‌విన్నర్, ఖోఖో విమెన్ ఖోఖోలో విన్నర్, విమెన్ షిటిల్‌లో విన్నర్, వాలీబాల్‌లో మెన్ విన్నర్, విమెల్ వాలీబాల్‌లో రన్నర్, విమెన్ కబడ్డీలో ద్వితీయ స్థానం, క్రికెట్‌లో మెన్ విభాగంలో తృతీయ స్థానం సాధించినట్టు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు విశాఖపట్నంలో జరుగుతాయన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు రూ.లక్ష విరాళం


దేవీపట్నం, ఫిబ్రవరి2: మండలంలో రావిలంక గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవరసిద్ధి వినాయక ఆలయానికి రూ.లక్ష విలువ గల ఇసుక, ఇనుమును ఆలయ కమిటీకి అందజేసినట్టు విశ్వహిందూ పరిషత్ రామసేతు వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలంతా ఏకతాటిపై వచ్చి ధర్మ దేవాలయంలో నిత్యం దీపారాధన చేయాలని పూజలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విశ్వధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, రాంబాబు, బాపన్నదొర, ప్రసాద్, జగన్నాధరావు, శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

ఇందుకూరులో భారీ అన్నసమారాధన

దేవీపట్నం,ఫిబ్రవరి2: మండలంలో ఇందుకూరు గ్రామశివారులో వేంచేసియున్న శ్రీదుర్గమ్మతల్లి ఆలయం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. నెలలో మొదటి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి అనంతరం భారీ అన్నదానం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించేందుకు ఇందుకూరు, భీంపల్లి, కొత్తవీధి తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

గ్యాస్ సిలెండర్ లీకై తాటాకిల్లు దగ్ధం

నల్లమిల్లిలో ఘటన.. రూ.8 లక్షల ఆస్తి నష్టం



రంగంపేట,ఫిబ్రవరి 2: మండలంలోని నల్లమిల్లిలో గ్యాస్ సిలెండర్ లీకై అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన సమ్మంగి వరలక్ష్మి శుక్రవారం ఉదయం వంట చేసేందుకు గ్యాస్‌స్టౌవ్‌ను వెలిగించగా గ్యాస్‌లీకై తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైందని వీఆర్వో కె.వెంకటరావు తెలిపారు. ఈ ప్రమాదంలో బంగారం, వెండి ఆభరణాలు, రూ.30 వేల నగదు, గృహోపకరణాలు, ఇంటి దస్తావేజులు, విలువైన పత్రాలు కాలిబూడిదయ్యాయని, సుమారు రూ.8 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కాగా వరలక్ష్మికి భర్త చనిపోయాడు. ఇద్దరు పిల్లలతో జీవిస్తోంది. అగ్ని ప్రమాదం జరగడంతో కట్టుబట్టతో మిగిలారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల నగదు, రూ.6 వేల విలువైన నిత్యావసర వస్తువులు అందించారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పరామర్శించి వైసీపీ నేతలు సమకూర్చిన రూ.30 వేల నగదు, బియ్యం, వంట సామగ్రిని అందించారు. సర్పంచ్ నల్లా పద్మ, మట్టా శ్రీను, కొండేపూడి చిన్న, నల్లా దుర్గాప్రసాద్, నల్ల చక్రరావు, మట్టా ప్రసాద్, వీరబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల విజయోత్సవ సభ

కోరుకొండ, ఫిబ్రవరి 2: మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల విజయోత్సవం సభ శుక్రవారం సాయంత్రం కోరుకొండలోని యూటీఎఫ్ హోంలో జరిగింది. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల అధ్యక్ష కార్యదర్శులు శివబాబు, లోవరాజేష్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ టీచర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అలుపెరగని పోరాటం చేశారని వారిని అభినందించారు. పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగలమన్నారు. సమావేశంలో మండలంలోని 22 గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలు ఎన్నికలకు సంసిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి
- అనపర్తి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం

అనపర్తి, ఫిబ్రవరి 2: సార్వత్రిక ఎన్నికలకు సమయం లేదని, ప్రతి కార్యకర్త ఎన్నికలకు సంసిద్ధం కావాలని టీడీపీ శ్రేణులకు అనపర్తి నియోజకవర్గ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం మండలంలోని రామవరంలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు పది పదిహేను రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని, ప్రతి ఓటరును కలుసుకునే విధంగా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యమని అయినా శ్రేణులు అశ్రద్ధ వహించొద్దని, త్వరలోనే పూర్తి స్థాయి ప్రణాళికతో ప్రజల ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, జుత్తుక కృష్ణ, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, వెలుగుబంటి సత్తిబాబు, బాసి, తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, జుత్తుగ సూర్యకుమారి, పోతంశెట్టి సుభాషిణి, బేరా వేణమ్మ, సిరసపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా ఎమ్మెల్యే ఆలోచనలు

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యుల సమావేశంలో అన్యాపదేశంగా తమ పార్టీ ఓటమిని అంగీకరించారనే విషయం నియోజకవర్గమంతా కోడై కూస్తోందని రామకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీస్తూ పార్టీకి తాను విధేయుడిని కాదని, ఏ పార్టీ అధికారంలోకి వస్తే అటు వెళ్లిపోతారని చర్చించుకున్నారని అన్నారు. రేపు రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని అటు వైపు వెళ్ళిపోదామని చర్చించుకోవడం ఆత్మహత్యా సదృశ్యమని అన్నారు. వైసీపీ కార్యకర్తలు ఇది గుర్తెరగాలని ఆయన మనోభావం, వ్యక్తిత్వం ఎటువంటిదో ఆలోచించుకోవాలని అన్నారు.

అనుమతుల్లేకుండా ఎలా తొలగించారు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి

బిక్కవోలు, ఫిబ్రవరి 2: కొమరిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం పేరుతో 150 ఏళ్ల వయస్సున్న చెట్టును అనుమతులు లేకుండా ఎలా తొలగించారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. కొమరిపాలెంలో ప్రభుత్వ నిధులు రూ.33 లక్షలతో మెయిన్‌రోడ్డును సీసీ రోడ్డుగా మారుస్తున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ రోడ్డులో విద్యుత్ స్తంభాల మార్పు పేరుతో రోడ్డు పక్కన వున్న నివాసితుల నుంచి సొమ్ములు వసూలు చేయడం అన్యాయమన్నారు. అలాగే రోడ్డు ప్రక్కన వున్న చెట్టును ఎటువంటి అనుమతులు లేకుండా తొలగించారని దీనిపై అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఎంపీ భరత్‌రామ్ పిల్ల సైకో.. జగన్ పెద్ద సైకో

- మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి, జనసేన నేత అనుశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2: రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ పిల్ల సైకో అయితే జగన్ పెద్ద సైకో అని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరంలో దమ్ముంటే చంద్రబాబు, లోకేశ్‌లు తనపై పోటీ చేసి గెలవాలని భరత్‌రామ్ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. భరత్‌కు ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతిలో ఘోరపరాభవం తప్పదన్నారు. ఎంపీ భరత్‌కు మతి భ్రమించిందని డాక్టర్ కర్రి రామారెడ్డి వద్ద వైద్యం చేయించుకోవాలని సూచించారు. అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ జనసేనాని పవన్‌కల్యాణ్ గురించి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుంటే మంచిదని, నగరంలో అక్రమ కట్టడాల వెనుక నీ వసూళ్లు ఏంటో అందరికీ తెలుసునన్నారు. ఇసుకర్యాంప్ ద్వారా భారీ అవినీతి చేస్తున్నారన్నారు. రాజమండ్రి కార్పొరేషన్ పరిధిలో ఖర్చుచేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ వైవీడీ ప్రసాద్, మజ్జి రాంబాబు, పైడిరాజు, ఈతలపాటి కృష్ణ, అల్లాటి రాజు, గుణ్ణం శ్యాం సుందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి అప్పారావు, అనుశ్రీ సత్యనారాయణ

పాలిక శ్రీను రాజకీయ వ్యభిచారి

టీడీపీ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి దాస్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2: రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ కార్యాలయంలో వైసీపీ నాయకుడు పాలిక శ్రీను రాజకీయ వ్యభిచారిగా మారాడని టీడీపీ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీను.. తమ నాయకులు ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆదిరెడ్డి అప్పారావులపై సత్యదూరమైన ఆరోపణలు చేస్తూ నోరు పారేసుకుంటున్నాడని మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, బషీర్, అలజంగి దేవుడు, కందికొండ అనంత్, తాడి ప్రసాద్, కోటిపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పిస్తా



టిడ్కో గృహాల్లో ఉంటున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 3: టిడ్కో ఇళ్ల సముదాయంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్థంగా ఉన్న పరిస్థితుల్లో ఇక్కడ ప్రజలు జీవనం సాగిస్తున్నారని, తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని కలెక్టరేట్ సమీపంలో గల టిడ్కో గృహాల ఏ-1 బ్లాక్ వద్ద నీటి సమస్య తీర్చేందుకు టీడీపీ నాయకులు సావాడ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకును ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను నేటికీ లబ్ధిదారులకు అందజేయ లేని చేతగాని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అని అన్నారు. నాలుగేళ్లలో ఇళ్లకు రంగులు వేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఇళ్ల సముదాయంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని అసమర్థ ముఖ్యమంత్రి అని మండిపడ్డారు. అనంతరం మావుళ్ళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మత్యేటి శివసత్యప్రసాద్, పండూరి అప్పారావు, ఆళ్ళ ఆనందరావు, ధర్మరాజు, దాసరి సాగర్, ఏడుకొండలు, కరణం రామారావు, ఇళ్ళ రాంబాబు, సింహాద్రి పాల్గొన్నారు.

రైల్వే డీఎస్పీగా మోహనరావు బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రైల్వే పోలీస్ రాజమహేంద్రవరం సబ్ డివిజన్ డీఎస్పీ(డీఎస్ఆర్‌పీ)గా ఎల్.మోహనరావు బాధ్యతలు స్వీకరించారు. 2019లో ఆరు నెలల పాటు క్రైమ్ సీసీఎల్-1గా ఆయన ఇక్కడ పని చేశారు. తర్వాత విజయనగరం ట్రాఫిక్‌లో నాలుగేళ్లు విధులు నిర్వర్తించి విజయ వాడలోని డీజీ ఆఫీస్‌కి వెళ్లారు. బదిలీపై జీఆర్పీకి వచ్చారు. రైళ్లలో నేరాల నియంత్రణపై దృష్టి సారిస్తామన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనను సీఐ విజయ్ శంకర్, ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు తదితరులు అభినందించారు.

టూటౌన్ సీఐగా శ్రీనివాసరావు



రాజమహేంద్రవరం టూటౌన్ సీఐగా వి.శ్రీనివాసరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో రాజోలు, సఖినేటిపల్లి, మామిడికుదురు, అమలాపురంలో ఆయన పనిచేశారు. రాజమహేంద్రవరం సీఐడీ ప్రాంతీయ కార్యాల యంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై టూటౌన్‌కి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంపై దృష్టి సారిస్తామన్నారు. పెండింగ్ కేసుల విచారణలపై, బాధితులకు సత్వర పరిష్కారం అందించడానికి కృషి చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్ఐలు సిబ్బంది అభినందించారు.

లీజు రద్దు చేసినా అక్రమంగా నిర్మాణాలు

కిమ్స్ బొల్లినేనిపై క్రైస్తవ జేఏసీ కన్వీనర్ ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2: బాలికల విద్య నిమిత్తం రాజమహేంద్రవరం కంబాలచెరువు సమీపంలో ఏఈఎల్‌సీకి చెందిన షాడే స్కూల్ స్థలం 16 వేల గజాల్లో కిమ్స్ బొల్లినేని సంస్థ అక్రమంగా నిర్మాణాలు చేస్తోందని క్రైస్తవ జేఏసీ కన్వీనర్ జి.డేవిడ్ నెల్సన్ బాబు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011లో 16 వేల గజాల స్థలం అక్రమంగా కిమ్స్ బొల్లినేని వారు తీసుకుంటే దానిపై తాము చేసిన ఆందోళనకు 2017 సెప్టెంబరు 20న చర్చి అధికారులు లీజును రద్దుచేశారని చెప్పారు. దీనిపై గుంటూరు, రాజమహేంద్రవరంలలో వివిధ కోర్టుల్లో వ్యాజ్యాలు నడుస్తున్నాయన్నారు. ఇటీవల కిమ్స్ బొల్లినేని హాస్పిటల్స్‌కు చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా షాడే స్కూల్ క్యాంపస్‌లో చొరబడి నిర్మాణ కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. పలు మార్లు తాము వారించినా వారు తాము సబ్ లీజుదారులమని చెప్పుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కిమ్స్ బొల్లి సంస్థపై చర్యలు తీసుకోవాలని, షాడే విద్యాసంస్థల పునరుద్ధరణ చేపట్టాలని, అక్రమ లీజుపై జిల్లా రిజిస్ట్రార్ స్పందించాలని డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు ఆర్.ప్రసన్నకుమార్, ఎం.శ్యామ్ సుందర్, ఎం.సుదర్శనరాజు, కె.సాల్మన్‌రాజు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

దుళ్లలో ప్రభుత్వ భవనాల ప్రారంభం

కడియం, ఫిబ్రవరి 2: ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రభుత్వ భవనాలకు అధికార పార్టీ నాయకులు ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కడియం మండలం దుళ్లలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ రైతు భరోసాకేంద్రం, సచివాలయ భవనాలను ప్రారంభించారు.

పోస్టల్ బీమా సొమ్ము అందజేత

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2: రాజమహేంద్రవరంలో బ్యానర్ కార్మికుడు సోమాల వీరాబాబు ఫ్లెక్సీ కడుతూ విద్యుదాఘా తానికి గురై మరణిస్తే అతను పోస్టల్ ప్రమాద బీమా పాలసీదారుడు కావడంతో బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ అందించారు. ఈ సం దర్భంగా శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 170 ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర కలిగిన తపాలాశాఖ ఎప్పటికప్పుడు సాంకేతికతను పుణికి పుచ్చుకుని ప్రజలకు సేవ చేస్తూ వస్తోందన్నారు. అనంతరం వీరబాబు భార్య ఆదిలక్ష్మికి రూ .10 లక్షల చెక్కును అందించారు. వీరబాబు పిల్లలకు చదువులో తన వంతుగా సహకరిస్తానని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు హామీ ఇచ్చారని ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు మండెల శ్రీరామ్మూర్తి చెప్పారు. సమావేశంలో రాజమండ్రి ఈస్ట్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ గంటి రామకృష్ణ, వెస్ట్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎన్‌సీహెచ్‌వి రాజేష్,ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంక్ మేనేజర్ రాజేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం ఎంపీడీవోగా వసంత

గోకవరం, ఫిబ్రవరి 2: గోకవరం ఎంపీడీవోగా కె.వసంత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విశాఖ జిల్లా పెందుర్తి మండల ఎంపీడీ వోగా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా గోకవరం వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కె.పద్మజ్యోతి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వసంతను మండలంలోని పలు శాఖల అధికారులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఢిల్లీలో షర్మిళా నిరసనలో జిల్లా నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలు కోసం దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిళారెడ్డి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ప్రత్యేక హోదా తో పాటు విభజన చట్టం లో పొందుపరిచిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో రాజమహేంద్రవరానికి చెందిన నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు ముళ్ళ మాధవ్, ఆకుల సూర్యభాగ్యలక్ష్మి, తాళ్ళూరి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలో 171 అడుగుల ఆంజనేయ విగ్రహం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 2: రాజానగరం దత్తపీఠం సెం టర్‌లో 171 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్టు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. స్థానిక సంహిత కళాశాలలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సుమారు రూ.10 కోట్లతో మహా వీర్ హనుమాన్ ట్రస్ట్ నిర్మిస్తున్న 171 అడుగులవిరాట్ శ్రీ ఆంజనేయ ఎత్తులో ప్రపంచంలోనే ఎత్తయిన విగ్రహం అని తెలిపారు. ఈనెల 7న గణపతి సచ్చిదానంద స్వామి శంకుస్థాపన చేస్తారని చెప్పారు.సమావేశంలో తోట సుబ్బారావు,ఇన్నమూరి దీపు,అశ్విని జవ్వార్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరణ

కోరుకొండ, ఫిబ్రవరి 2: కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్లో శుక్రవారం సాయంత్ర యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా ఓపీఎస్ అమలు చేయాలని, తద్వారా అనేక కుటుంబాలకు లబ్ధి కలుగుతుందన్నారు. అలాగే రానున్న ఎన్నికల అన్ని రాజకీయ పార్టీలో ఓపీఎస్‌ను అమలు చేసే విధంగా మేనిఫెస్టోలో పెట్టాలని, అలా పెట్టిన వారికి మాత్రమే రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షులు జీవీ శివబాబు, కార్యదర్శి బీఎల్ రాజేష్, ఉపాధ్యాయులు ఆనంద్‌బాబు, షరీఫ్, ప్రసాద్ పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో 'నన్నయ' విద్యార్థికి కాంస్యం



పతక విజేత కోటేశ్వరరావును అభినందిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి: అఖిల భారత వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థి ఈ.కోటేశ్వరరావు మూడో స్థానం సాధించి కాంస్య పతకం కైవసం చేసుకున్నట్టు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. యూనివర్శిటీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చండీఘడ్ విశ్వవిద్యాలయంలో గత నెల 26నుంచి 29వరకూ జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో 55 కిలోల కేటగిరిలో కోటేశ్వరరావు ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించారన్నారు. ఇటీవల నన్నయ వర్శిటీలో నిర్వహించిన సౌత్‌వెస్ట్‌జోన్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో అర్హత సాధించిన ముగ్గురు విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా కోటేశ్వరరావు మూడో, జె.మధుబాబు నాలుగో స్థానంలో నిలిచారన్నారు. పీఆర్ కళాశాలలో చదువుతున్న ఈ ఇద్దరూ అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే ఖేలో ఇండియా క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, కోచ్ టి.శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక వికాసం

జిల్లా జిల్లా స్కూల్ ఫెసిలిటీ అబ్జర్వర్ డానియల్

బిక్కవోలు, ఫిబ్రవరి 2: క్రీడల ద్వారా మానసిక, శారీరక వికాసం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంకల్పం లైఫ్ స్కిల్ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా స్కూల్ ఫెసిలిటీ అబ్జర్వర్ డి.డానియల్ తెలిపారు. పందలపాక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సంకల్పం లైఫ్ స్కిల్ ప్రోగ్రాంను శుక్రవారం ఆయన పరిశీలించారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీడీ యువరాజారెడ్డి, ఎస్ఎస్ ఉపాధ్యాయుడు వీర్రెడ్డిల సహకారంతో పాఠశాలలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను ఈ కార్యక్రమం ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. లీడర్ గేమ్స్ ఆడించి వాటి ద్వారా పొందిన అనుభూతిని ప్రశ్నల ద్వారా తెలుసుకుని ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.

కెనాల్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు

బిక్కవోలు, ఫిబ్రవరి 2: అనపర్తి కెనాల్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ములగపాటి శివరామకృష్ణంరాజు ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు లేఖ రాశారు. ఈ లేఖను ఆయన శుక్రవారం విలేకర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ఏం జరిగినా సొంత డబ్బా కొట్టుకుని, ఢిల్లీ నుంచి పత్రికా ప్రకటనలు చేయడం తప్ప ఎంపీ నిధులతో నియోజకవర్గంలో చేసిందేమీ లేదన్నారు. త్వరలో ఎన్నికలు రానున్న దృష్ట్యా కనీసం చివరిగానైనా కెనాల్ రోడ్డుకు శాశ్వత పరిష్కారంతో పాటు, రంగంపేట ఏడీబీ రోడ్డులో నివాసం కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం వంటి అంశాలపై దృష్టి సారించాలని ఎంపీకి లేఖ రాసానన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజమహేంద్రవరం ఎంపీ సీటును బీజేపీ గెల్చుకోవడం ఖాయమని శివరామకృష్ణంరాజు పేర్కొన్నారు.

ఈఈ వరప్రసాద్ సేవలు అభినందనీయం



ఈఈ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న జేగురుపాడు సర్పంచ్ స్టాలిన్

కడియం, ఫిబ్రవరి 2: జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఈఈ వరప్రసాద్ సేవలు అభినందనీయమని జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్ అన్నారు. స్టాలిన్.. ఈఈ వరప్రసాద్ పదవీవిరమణ కార్యక్రమానికి హాజరై పూలమాలతో సత్కరించారు. మండలంలో ప్రాధాన్య భవనాల నిర్మాణంలో ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు.

కడియం ఎంపీడీవోగా రాజ్‌మనోజ్

కడియం, ఫిబ్రవరి 2: కడియం ఎంపీడీవోగా జి.రాజ్‌మనోజ్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో కె.రత్నకుమారి కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం నుంచి రాజ్‌మనోజ్ కడియం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ పరిపాలనాధికారి కె.చంద్రరావు, ఉద్యోగులు పూలమొక్కను అందజేసి స్వాగతించారు.

మగ్గం వర్క్ శిక్షణ ధ్రువపత్రాలు అందజేత

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 2: మగ్గం వర్క్ శిక్షణను ఆదాయవనరుగా ఉపయోగించుకోవచ్చునని వినయ్ సుంకర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. ఫౌండేషన్ ద్వారా రాధేయపాలెంలో ఉచిత మగ్గం శిక్షణ పూర్తి చేసుకున్న 70మందికి శుక్రవారం స్థానిక ఫౌండేషన్ కార్యాలయం వద్ద ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీలు సుంకరనాగేశ్వరరావు, వీరాస్వామి, వినీల తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించాలి

రౌండు టేబుల్ సమావేశంలో వక్తలు

స్థలాలను కుదించడం అన్యాయం: టీకే

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2 : సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో సాంస్కృతిక వారసత్వ సంపదలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ సమున్నత చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన వారసత్వ సంపదను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి ఛైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సుందరీకరణ పేరుతో చారిత్రక స్థలాలను కుదించడం అన్యాయమని అన్నారు. జిల్లా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ ఆకుల వీర్రాజు, పంతం చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పంతం కొండలరావు మాట్లాడారు. పాత్రికేయులు కృష్ణకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వారితో రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ సమితి కమిటీని ఏర్పాటు చేశారు. డాక్టర్ అనసూరి పద్మలత, టి.అరుణ్, కేకే సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.





తగ్గేదేలే!

అడవి అడ్డా.. గంజాయి దందా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

దట్టమైన అరణ్య ప్రాంతాల్లో వందల ఎకరాల్లో గంజాయి సాగవుతోంది. పోలీస్, ఫారెస్టు సిబ్బంది కళ్లు మూసుకొని 'కాని చేస్తుండడం'తో వేల కిలోల గంజాయి మైదాన ప్రాంతాలకు తరలిపోయి యువత జీవితాలకు పొగ పెడుతోంది. గిరిజన గ్రామాల్లో యువతకు ఇదే లాభసాటి ఉపాధి మార్గంగా మారిపోయింది. గత ప్రభుత్వం గిరిజన యువతకు ప్రత్యామ్నాయ ఉపాధిపై శ్రద్ధ చూపగా..వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారి జీవితాలు పొగసూరిపోతున్నాయి. దళారులు, ప్రభుత్వాధికారులు మామూళ్లతో ఎంజాయ్ చేస్తుంటే.. పూట గడవడం కోసం చట్టానికి వ్యతిరేకంగా వెళ్తున్న గిరిజనం జైళ్లలో మగ్గిపోతున్నారు.ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన గంజాయి పొగ.. ఇప్పుడు పల్లెల్లో సైతం గుప్‌మంటోంది. గంజాయి విషయంలో యంత్రాంగం చెబుతున్న మాటలు చూస్తే తులసి వనానికి గంజాయి చేనుకు ఉన్నంత తేడా కనిపిస్తోంది. కాకినాడకు చెందిన కానిస్టేబుళ్లు ఏకంగా గంజాయి రవాణాకు ఉపక్రమించారంటే వ్యాపారం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. వారిని తెలంగాణ పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకోవడంతో విషయం బయటకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం కూడా గంజాయి విషయంలో ఇటు ఏపీపైనే ఎక్కువగా దృష్టి సారించినట్లు కనబడుతోంది. ఏదేమైనా ఈ నాలుగున్నరేళ్లలో ఏపీ తూర్పు మన్యం, ఏవోబీ ప్రాంతం గంజాయి హబ్‌గా మారిపోయిందనే అపవాదు ఉంది. గంజాయి మత్తుకు యువత, విద్యార్థుల జీవితాలు నిర్వీర్యం అవుతుండగా ఆరోగ్యం అడుగంటిపోతోంది.

ఏజెన్సీ నుంచి వచ్చేదిలా..

ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని మంచంగిపుట్ట, పాడేరు,అరకు, చింతపల్లి, పెదబయలు, జి.మాడుగుల, హు కుంపేట, సీలేరు తదితర మండలాల్లోని దాదాపు 50 పంచాయతీల పరిధిలో 200 వరకూ మారుమూల గ్రామాల్లో సాగు చేస్తున్న గంజాయి 25 వేల ఎకరాల పైమాటే. మొత్తం మీద ఆ మన్యంలో రూ.2 వేల కోట్ల వరకూ ఏడాదికి వ్యాపారం జరుగుతుందని అంచనా. స్థానికంగా గ్రామాల్లో కిలో రూ.2 వేల నుంచి ప్రారంభమవుతుంది. నాణ్యతను బట్టి రేటు ఉంటుంది.పాడేరు, చింతపల్లిలో రూ.5వేలు, నర్సీపట్నంలో రూ.10 వేలు పలుకుతుంది. కొనుగోలుదారులు చెప్పిన ప్రాంతానికి చేరిస్తే దూరాన్ని బట్టి ధర ఉంటుంది. దళారులు ఆ బాధ్యతను నిర్వర్తిస్తారు.చింతపల్లి నర్సీపట్నం, తుని గుండా హైవేకు.. నర్సీపట్నం, కాకరపాడు, రాజవొమ్మంగి, ఏలేశ్వరం, ఎర్రవరం దగ్గర హైవేకు.. సీలేరు, డొంకరాయి, చింతూరు, మారేడుమిల్లి, రంపచోడవరం,రాజమండ్రి.. చింతపల్లి, సీలేరు, డొంకరాయి,చింతూరు, భద్రాచలం గుండా తెలంగాణకు రవాణా చేస్తున్నారు.ఏడాది పొడవునా సర ఫరా జరుగుతోంది. సామర్లకోట,రాజమండ్రి రైల్వే స్టేషన్ల ద్వారా కూడా గంజాయిని తీసుకెళ్తున్నారు.తమిళనాడు లో ని సేలం,ఈరోడ్, కేరళ, మహారాష్ట్ర,ఢిల్లీ, హైదరాబాద్ ఎక్కువగా వెళుతోంది. తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్, కర్నా టక, ఒడిషా వంటి సుదూర ప్రాంతాలకు చేరిస్తే కిలోకి రూ.50వేలు, హైదరాబాద్‌లో అప్పగిస్తే రూ.20వేలు ముడుతుంది.

ఐదు నెలల్లోనే లక్షాధికారి..

ఎకరా సాగుకు రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుండగా రూ.10 లక్షల వరకూ రకం, డిమాండును బట్టి ఆదాయం వస్తోంది. సంప్రదాయ పంటలు పోయి ఆధునాతన సాంకేతికతతో గంజాయి పండిస్తున్నారు. ఎకరాకు 500 వరకూ పాదులు పెట్టి ఒక్కో పాదులో 20 వరకూ మొక్కలు నాటతారు. వారంలో మొలకెత్తి నెలలో మొక్క దశకు వచ్చేస్తుంది. ఐదు నెలల్లో పంట చేతికొచ్చేస్తుంది. తర్వాత గంజాయిని కోసి ఆరబెడతారు. ఇళ్లలో నాణ్యత, రకం చూపించడానికి కొద్ది మొత్తంలో ఉంచి రహస్య ప్రాంతాల్లో పెద్ద మొత్తాల్లో దాస్తుంటారు. దీంతో ఏజెన్సీలో ఉండే గిరిజనేతరులుఈ సాగుపై దృష్టి సారించారు.

మామూళ్ల మైకంలో..

గంజాయి వేల ఎకరాల్లో సాగవుతుంటే మరి పోలీసులు, ఫారెస్టు, రెవెన్యూ శాఖలు ఏం చేస్తున్నట్టు.. అక్కడ అవి ఉండవా? అనే అనుమానం రావొచ్చు. కచ్చితంగా ఉంటాయి. అయితే గంజాయి నిర్మూలనకు ఉన్నతాధికారులు ఆపసోపాలు పడుతుంటే స్థానిక సిబ్బంది మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని విధులు నిర్వర్తిస్తుంటారు. ఏజెన్సీ మండలాల్లో బేస్ క్యాంపులు ఉంటాయి. పోలీసుల చెక్‌పోస్టులు.. అటవీ సంపద అక్రమంగా తరలిపోకుండా ఫారెస్ట్ చెక్‌పోస్టులు మండలంలో 15 వరకూ ఉంటాయి. మారేడుమిల్లి, రాజవొమ్మంగి, చింతూరు,జడ్డంగి తదితర పోలీస్ స్టేషన్లు రోడ్డు పక్కనే చూస్తుంటాయి. కానీ అరకొర తప్ప భారీ తరలింపులు వాటికి కనిపించవు. గంజాయి సాగు, రవాణా వంటి విషయాలు పోలీసు, ఫారెస్టు వాళ్లకు తెలియని తంతు కాదనే వాదనా ఉంది. గంజాయి రవాణాకు సహరిస్తున్న చింతూరు ఎస్ఐ, కానిస్టేబుల్ అరెస్ట్ అయ్యారు. పోలీసులు చూసీచూడకుండా వదిలేయడానికి 'ఒప్పందాలు' ఉంటాయని..అయితే కేసుల నిమిత్తం స్వల్ప పరిమాణంలో కొంత పట్టివ్వాలనే లోపాయి కారీ విధానాలు అమల్లో ఉంటాయని స్థానికులు చెబుతుంటారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులోని మారుమూల గ్రామాలు కావడంతో నక్సల్స్ ప్రభావం ఉంటుంది. అది కూడా గంజాయి సాగుకు కలిసొస్తుంది. పైగా ఒకవేళ పైఅధికారులు అడిగితే మన పరిధి కాదని,అక్కడికి వెళ్లాలంటే ఫోర్సు ఎక్కువ అవసరమని స్థానిక అధికారులు తప్పుదోవ పట్టిస్తుంటారనేది బహిరంగ రహస్యం.శాటిలైట్ ఇమేజ్‌లు ద్వారా సాగు జరగడం లేదని తెలుస్తోందని పోలీసుల ఉన్నతాధికారులు చెబుతున్నా మైదాన ప్రాంతాలకు తరలిపోతున్న వేల కిలోల గంజాయి ఆ మాటలను వెక్కిరిస్తోంది.రోజూ వాహనాల్లో లేదా వివిధ మార్గాల్లో గంజాయి తరలిపోతున్నా సమాచారం వస్తేనే స్వాధీనం చేసుకుంటుండడం మరో హాస్యాస్పదమైన విషయం.

ఉపాధి కరువై

గిరిజనోద్ధరణకు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పనిచేస్తోంది. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక గిరిజనులపై పాలకుల చిన్నచూపుతో ఉపాధి కరువైంది. గత ప్రభుత్వంలో గంజాయి సాగు ధ్వంసం నిరంతరాయంగా జరిగేది. సాగు చేస్తున్న గిరిజనులకు కౌన్సెలింగ్ చేసి జీడిమొక్కల వంటివి ఇచ్చి పెట్టుబడి సహాయం చేసేది.ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించేది.కానీ ఈ ప్రభుత్వం వచ్చాక అలాంటివి పడకేశాయి. జైలు నుంచి విడుదలైన తర్వాత గిరిజనుల ఉపాధి గురించి పట్టించుకోవడం లేదు.దాంతో తప్పని పరిస్థితుల్లో గంజాయితో బతుకీడుస్తున్నారు.సాగు చేసే ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంటుంది. అక్కడి నుంచి రోడ్ పాయిం ట్‌కి చేర్చడానికి గిరిజనులనే వినియోగిస్తారు. వారికి ఇచ్చే కూలి అతి తక్కువగా ఉంటుంది.25 నుంచి 50 కిలోల బస్తాను సుమారు 25 కిలోమీటర్లు చేరిస్తే రూ.500 నుంచి వెయ్యి వరకూ ముట్టజెబుతారు.కొండల్లోని కాలిబాటల్లో నడుస్తూ రోడ్డు పాయింట్లకు గంజాయి చేరవేస్తారు.

వైసీపీ నాయకుల హవా

వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ నాయకుల అక్రమ వ్యాపా రాలకు అడ్డే లేదనేది బహిరంగ రహస్యం. గంజాయి వ్యాపారంలోనూ వారు బాగా రాణిస్తున్నారు. వైసీపీ నాయకుల బెదిరింపులు, ఆమ్యామ్యాలతో స్థానిక పోలీసులు, ఫారెస్టు సిబ్బంది రవాణాను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కొద్ది రోజుల కిందట ఓ వ్యాను దట్టమైన అటవీ ప్రాంతాన్ని దాటుకొని రోడ్డు పక్కనే ఉన్న రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లను ఎన్నో చెక్ పోస్టులను దాటుకొని దూసుకువెళ్తోంది. ఏలేశ్వరం పోలీసులు ఆ వ్యాన్‌ని ఆపి చెక్ చేశారు. ఇంకేముంది ఏకంగా 1400 కిలోల గంజాయి పట్టుబడింది.ఆరాతీస్తే ఆ గంజాయి తరలిస్తున్న వ్యక్తి రాజవొమ్మంగి సర్పంచ్‌గా పోటీ చేసిన వైసీపీ నాయకుడు. గతంలో గిరిజనం ఎక్కువగా పేకాట, మద్యానికి అలవాటు పడేవారు. ఇప్పుడు గంజాయి విరివిరిగా దొరుకుతుండడంతో వినియోగంతో పాటు ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు.

సెంట్రల్ జైలులోనే 600 మంది

ముగ్గురు అమాయక గిరిజన మహిళలు గంజాయితో రాజమహేంద్రవరం ఎస్ఈబీ పోలీసులకు పట్టుబడ్డారు. కనీసం వారి కాళ్లకు చెప్పులు కూడా లేవు. ఆ గంజాయిని విజయవాడలో అప్పగిస్తే రూ.2వేలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. ఇలా గంజాయి దందాలో అమాయక గిరిజనం జీవితాలు చిత్తవుతున్నాయి. ముఖ్యంగా యువత జీవితాలు నాశనమవుతున్నాయి. గంజాయిని తరలించే క్రమంలో అనుమానం రాకుండా ఉండడానికి మహిళలను రంగంలోకి దింపుతున్నారు. అమాయక గిరిజనులు పోలీసులకు పట్టుబడుతూ జైళ్లలో మగ్గిపోతున్నారు. పెట్టుబడిదారులు, స్మగ్లర్లు 'ఎందుకనో' పోలీసుల చేతికి చిక్కడం లేదు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో ఉన్న రిమాండు/శిక్షపడిన ఖైదీలు సుమారు 600 మంది ఉన్నారు. వాళ్లలో కొందరికి బెయిల్ వచ్చినా పూచీకత్తులు సమర్పించుకొనే స్తోమత లేక కటకటాల్లో మగ్గిపోతున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిబంధనల ప్రకారం సహాయం అందిస్తోంది. గిరిజనుల కోసం ఉన్న కమిషన్లు, వ్యవస్థలు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియని పరిస్థితి. ఏజెన్సీలో అత్యంత తక్కువ ధరకు దొరకడంతో స్థానికంగా వినియోగం కూడా బాగా ఎక్కువైంది.

- గంజాయి మత్తు..జీవితాలు చిత్తు
- పల్లెల్లో కూడా గుప్పు గుప్పు
- అడవిలో కిలో రూ.2 వేలు
- సేలం చేరిస్తే రూ.50 వేలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- చూసిచూసి పోలీసులదీ అదే బాట
- గంజాతో చిక్కిన కాకినాడ పోలీసులు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- రెచ్చిపోతున్న స్మగ్లర్లు
- ఉపాధిలేక సాగు వైపు గిరిజనం
- గతంలో ప్రత్యామ్నాయంపై చొరవ
- ఇప్పుడు జైళ్ల పాలు చేస్తున్న ప్రభుత్వం

పోలీసులే..కళ్లు గప్పి..

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది.అక్రమ నిల్వలను పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకుంటున్నారు. అయినా సరే గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఏజెన్సీలోని నక్సల్స్ కార్యకలాపాల అదుపు, శాంతి భద్రతల కోసం ఏపీఎస్పీ బెటాలియన్‌నుంచి పలు ట్రూపులు వెళ్లి వస్తుంటాయి. ఏజెన్సీలో కిలో గంజాయి రూ.2 వేల నుంచి రూ.3 వేలకు లభించడంతో వీటిని దూర ప్రాంతానికి తీసుకెళ్లి రూ.15వేలకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. పోలీసుల ముసుగులో సులువుగా డబ్బులు సం పాదించవచ్చనే ఉద్దేశంతో వీరు సెలవు పెట్టి మరీ అక్రమ గంజాయి రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం. గంజాయి తరలింపులో ఎక్కడెక్కడ చెక్‌పోస్టులు, తనిఖీలు ఉంటాయి, పోలీసులు కళ్లు కప్పి ఎలా తప్పించుకోవచ్చనే దానిపై వీరు పక్కా ప్రణాళికతో కొంతకాలంగా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ వ్యవహారంలో ఇద్దరు పట్టుబడడంతో వీరు పైకి నిందితులుగా కనిపిస్తున్నారని,లోతుగా విచారణ నిర్వహిస్తే మరింత మంది గంజాయి అక్రమ రవాణా వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నా యని పలువురు భావిస్తున్నారు.ఎస్పీ, అదనపు కమాండెంట్ లోతుగా విచారణ నిర్వహించాలని కోరుతున్నారు.



కంచే చేను మేసింది..

ఉలిక్కిపడ్డ జిల్లా పోలీస్ యంత్రాంగం

సర్పవరం జంక్షన్/కాకినాడ క్రైం/ప్రత్తిపాడు, ఫిబ్రవరి 2: క్రమశిక్షణకు మారుపేరుగా,పోలీసు శిక్షణ, విధి నిర్వహణలో అం కితభావంతో పనిచేసే వ్యవస్థగా రాష్ట్రంలోనే ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు పేరుంది.అంతటి ఖ్యాతి ఉన్న కాకినాడ ఏపీ ఎస్పీ బెటాలియన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు 22 కిలోల గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ గురువారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసులకు అడ్డంగా దొరకడం పోలీసు వర్గాల్లో సంచలనం రేకెత్తించింది. తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో హెడ్‌కానిస్టేబుల్ సాగర్ పట్నాయక్, కానిస్టేబుల్ శ్రీనివాస్ ఉన్నారు. వీరిని బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేసి గంజాయితో పాటు వాహనాన్ని సీజ్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చిం ది. కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో విశాఖకు చెందిన సాగర్ పట్నాయక్(2013 బ్యాచ్) హెడ్‌కానిస్టేబుల్‌గా, ప్రత్తిపాడుకు చెందిన శ్రీనివాస్ (2009) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు.ఇందులో శ్రీనివాస్ విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడం,సెలవులు తరచుగా పెట్టడంతో పలుసార్లు శాఖాపరమైన చర్యలకు గురయ్యాడు. వీరిద్దరూ డీ గ్రూప్‌లో పనిచేస్తున్నారు.వీరు మెడికల్ లీవ్ పేరుతో సెలవుపెట్టి నెలరోజులుగా విధులకు రావడం లేదు. గురువారం రాత్రి మారుతీ వాహనంలో 22కిలోల గంజాయిని 11 ప్యాకెట్లతో వెళ్తుండగా హైదరాబాద్‌లోని బాచుపల్లిలో తెలంగాణపోలీసులు పట్టుకోవడం సంచలనం రేకెత్తించింది. పప్పల శ్రీనివాస్ స్వగ్రామం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాథపురం (యుజేపురం) కావడంతో ఆ గ్రామంలో కలకలం రేగింది.

సమగ్ర విచారణకు ఆదేశం

గంజాయి అక్రమ రవాణా కేసులో పట్టుబడ్డ ఇద్దరు కానిస్టేబుల్స్‌పై సమగ్ర విచారణకు ఆదేశించాం. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. సాగర్ పట్నాయక్, శ్రీనివాస్‌లు ఇద్దరూ జనవరి 2వతేదీ నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నారు.

- ఎస్.సతీష్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ

జగనన్నా.. ఇదేందన్నా!

- నేడు ఏలూరులో జగన్ సిద్ధం సభ

- బస్సుల కోసం బడులకు సెలవు - ఇంటర్ పరీక్ష వాయిదా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం అర్బన్ : రాష్ట్రమొక రాజ్యం.. ఆయనొక ప్రభువు అనే చందంగా పాలన సాగుతుందనడానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం ఉండదేమో. బడి, పరీక్షలు అన్నీ వారిష్టమే. ఓ నైతికత, పద్ధతి ఉండదు. జగన్ సభ ఉందంటే పచ్చని చెట్లు కొట్టేస్తారు. పాఠశాలలకు సెలవులు ఇచ్చేస్తారు. చివరికి పరీక్షలను సైతం వాయిదా వేసేస్తారు. ఏలూరులో శనివారం జగన్ సిద్ధం సభ ఏర్పాటు చేశారు. దీనికి జనాలను బలవంతంగా తరలించడానికి బస్సుల అవసరత ఉండడంతో ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించేశారు. 3న జరగాల్సిన ఇంటర్మీడియట్ పర్యావరణ విద్య పరీక్షను ఈ నెల 23కు వాయిదా వేశారు.2న పరీక్ష జరగ్గా.. జగన్ సభ కోసం 3వ తేదీ పరీక్షను అకస్మాత్తుగా వాయిదా వేశారు. సెలవు, పరీక్ష వాయి దాపై తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రశ్నించినా సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో అధికారులు మిన్నకుండిపోయారు. ఇంటర్మీడియట్ ఎన్విరాన్‌మెంటల్ పరీక్షను ఎలాంటి కారణం లేకుండా వాయిదా వేయడం సిగ్గుమాలిన పని అని దీనిపై ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా మండిపడ్డారు. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాలో సీఎం మూడుసార్లు పర్యటిస్తే ఆ మూడు రోజులు కూడా సెలవులు ఇచ్చారని, అసలు సీఎం మీటింగ్‌కు విద్యార్థులకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించడాన్ని నిరసిసూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నగర కార్యదర్శి రాఘవ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను పాతాళం లోకి నెట్టివేస్తున్నారని విమర్శించారు.కార్యక్రమంలో సాయి, నాయకులు చైతన్య, చంద్రిక, శ్రీదేవి, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వో శశిప్రియాంక సస్పెన్షన్

దేవరపల్లి, ఫిబ్రవరి 2: దేవరపల్లి మండలం యర్నగూడెం సచివాలయం వన్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ బూత్‌లెవిల్ అధికారి కే.శశిప్రియాంకను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఓటర్ల తుది జాబితాలో సక్రమంగా విధులు నిర్వహించనందుకు బీఎల్‌వో శశిప్రియాంకను సస్పెండ్ చేసినట్టు దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయానికి సస్పెండ్ ఆర్డర్‌ను జారీ చేశారు.యర్నగూడెం సచివాలయం వన్‌లో చనిపోయిన వారిని తొలగించకుండా డబుల్ ఎంట్రీలు తీయకుండా ఫైనల్ లిస్టు రావడంతో ఈ సస్పెన్షన్ చేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

37,200 మంది యువతకు ఓటు

జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 18 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న యువత మొత్తం 47,333మంది ఉన్నట్టు గుర్తించి, అందులో 37,200 మందికి ఓటు హక్కు కల్పించినట్టు జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి శుక్రవారం నిర్వహించినకలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాధవీలత పాల్గొన్నారు. జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్టు చెప్పారు.పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఇప్పటికే ఈఆర్వోలకు సూచనలు ఇచ్చినట్టు తెలిపారు.కొత్తగా అనపర్తి, నిడదవోలు ఈఆర్వోలుగా ఎం.మాధురి, రమణా నాయక్ నియమితులైనట్టు చెప్పారు.



అమానుషం

ప్రశాంత గోదావరి జిల్లాలో అశాంతి



భర్త, కుమారుడితో షేక్ ఆశ(ఫైల్)

- తూర్పున రెండో శిరోముండనం కేసు
- ఏలుకోమంటే భార్యకే గుండుకొట్టాడు
- నీ దిక్కున్న చోట చెప్పుకోమని హెచ్చరిక
- పెదకొండేపూడిలో ఘటన
- కన్నీరుమున్నీరైన వివాహిత
- జిల్లాలో చర్చనీయాంశం

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన గోదావరి జిల్లాలో ఎన్నడూ లేని అశాంతి అభద్రత చోటు చేసుకుంది.. రోజురోజుకు గోదావరి జనం వికృత చేష్టలకు పాల్పడుతూ గోదావరి జిల్లాల ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారు. సీతానగరం మండలం పెదకొండేపూడిలో శుక్రవారం జరిగిన సంఘటనే ఒక ఉదాహరణ. ప్రేమించి పెళ్లాడిన భార్య తనను ఏలుకోమన్నందుకు ఒక భర్త శిరోముండనం చేసి నీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ హెచ్చరించి వెళ్లిపోయాడు. పాపం ఎవరూ లేని మహిళ పోలీసులను ఆశ్రయించింది. హైదరాబాద్‌కు చెందిన ముస్లిం యువతి షేక్ ఆశ హైదరాబాద్ ఫిల్మ్‌సిటీలో జూనియర్ ఆర్టిస్ట్‌గా ఉండగా,ఇతర సినీ యూనిట్‌లో అసి స్టెంట్‌గా పెదకొండేపూడికి చెందిన కర్రి రాంబా బు అనే అభిరామ్ ఉండేవాడు. ఇద్దరికి ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది.. అనంతరం ఇద్దరూ వివాహం చేసుకున్నారు. ఒక అబ్బాయి పుట్టాడు.ఆ తర్వాత రాంబాబు తన భార్య పిల్లాడిని వదిలేసి సొంతూరు పెదకొండేపూడి వచ్చేశాడు.తర్వాత ఆశ వచ్చినా కాపురం కుదరక పోవడంతో సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. అయినా ఇంతవరకూ పోలీసులేమీ చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఆమె స్వయంగా భర్త ఇంటికి వెళ్లింది. దీంతో భర్త, అతని తల్లిదం డ్రులు ఇంటికి తాళాలు వేసుకుని వేరేచోటికి వెళ్లి పోయారు.ఆశ గేటు తాళాలు బద్దలు కొట్టుకుని అక్కడే ఉంటుంది.ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం భర్త వచ్చి ఆమెతో గొడవ పడ్డాడు. అతను ఆమెను కింద పడేసి మెడమీద కాలు పెట్టి, టిమ్మర్‌తో ఆమెకు గుండు గీసేశాడు.ఆమె లబోదిబో మంటుండడంతో ఇరుగుపొరుగు వారు వచ్చేసరికి ఆమెను ఈడ్చుకుంటూ వచ్చి, జుట్టు అందరికీ చూపిస్తూ వెళ్లిపోయినట్టు ఓ వీడియో హల్‌చల్ చేస్తోంది.గుండు గీశాను. కేసు పెట్టుకో అని కూడా అతను హెచ్చ రిస్తున్నట్టు ఆ వీడియోలో ఉంది. ఆమె తర్వాత తన బిడ్డను తీసుకుని పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యా దు చేసింది.సీతానగరం ఎస్ఐ రామకృష్ణ ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసి నిందితుడు అభిరా మ్ ను రిమాండ్‌కు పంపిస్తు న్నామని ఎస్ఐ చెప్పారు.

సీతానగరంలో రెండో శిరోముండనం

తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ వచ్చాక ఇది రెండో శిరోముండనం. 2020లో జూలై20న సీతానగరం మండలం మునికూడలిలో వరప్రసాద్ అనే దళిత యువకుడు ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నాడనే కారణంతో అతన్ని సీతానగరం పోలీసు స్టేషన్‌కు తీసుకుని వెళ్లి శిరోముండనం చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో రాజానగరం వైసీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిందితులకు అండగా ఉన్నట్టు దళితులు అనేక సార్లు ఆరోపించిన సంగతి తెలిసిందే.ఈ కేసు ఇంకా పరిష్కారం కాకముందే,అదే మండలంలో షేక్ ఆశకు భర్త శిరోముండనం చేశాడు. 1997లో ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో దళిత యువకులకు శిరోముండనం చేయించిన సంగతి తెలిసిందే.ఆ కేసు ఇంకా నడుస్తోంది.

హైకోర్టు సీరియస్ అయిన మర్నాడే..


1997 నాటి వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కేసు విచారణ ఆరు నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు విశాఖలోని ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టును గురువారం ఆదేశించిన సంగతి తెలిసిందే. సీతానగరం మండలం మునికూడలికి చెందిన దళిత యువకుడు వరప్రసాద్ కేసుపై కూడా హైకోర్టు గురువారం సీరియస్ అయింది. ఈ కేసును ఉపసంహరించుకోవాలని శిరోముండన నిందితులు ఆరుగురు, ఎస్ఐతో సహా హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.దీనిని హైకోర్టు కొట్టిపారేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటే ఇటువంటి చెడు సంస్కృతి ప్రబలే అవకాశం ఉండదని ,పోలీసులు నిర్లక్ష్యం, రాజకీయనేతల అండవల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

రెండు చేతులు వెనక్కి విరిచి గుండు గీసేశాడు..

రాజమహేంద్రవరం అర్బన్ : నా భర్త, మామలతో కలసి ఆ ఇంట్లో నాకు స్థానం కల్పించాలి. నా బిడ్డకు హక్కు కావాలి అని శిరోముండనం బాధితురాలు ఆశ కోరారు. మనకు గొడవలు వద్దు అని చెప్పి మా ఆయన నన్ను ఇంట్లోకి తీసుకెళ్లాడు. లోపలికి వెళ్లాక చెయ్యిపట్టుకుని లాక్కెళ్లి నడుం, మెడపై కూర్చుని, రెండు చేతులు వెనక్కి విరిచి పట్టుకుని గుండు గీసేశాడు. నేను పెళ్లి చేసుకుంటే నా పెళ్లికి అడ్డొస్తావా, నీకు తాళి కట్టానా ? సరదాగా సహజీవనం చేశాను, నువ్వు నా పెళ్లాం ఏంటి అన్నాడు. అందరూ నాకు సపోర్టు ఉన్నారు అంటూ నన్ను ఇలా చేశాడు అని రోదించింది.శిరోముండనానికి గురైన బాధితురాలు ఆశను ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులు తమ పర్యవేక్షణలోకి తీసుకుని శుక్రవారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో వైద్యసేవలు అందించారు.జీజీహెచ్‌లో వైద్యసేవలు పొందుతున్న బాధితురాలిని రాజానగరం ఎమ్మెల్యే రాజా, గణేశ్ పరామర్శించారు. జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.బాధితురాలికితోడుగా ఉంటాం అన్నారు. స్థానిక ముస్లిం నాయకులు ఆరీఫ్, ఇమామ్ మౌలానా బాధితురాలికి తోడ్పాటు అందించారు.సీతానగరం ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో జీజీహెచ్‌కు వచ్చారు. బాధితురాలిని రాజమహేంద్రవరంలోని స్టేట్‌హోంకు తరలిస్తున్నట్టు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులు వెల్లడించారు.

చివరిలో వచ్చి.. సాధించారు!

- రాజమహేంద్రవరం వైసీపీ ఎంపీ సీటు గూడూరికే
- ఆది నుంచి ఉన్న వారికి మొండిచేయి
- నాలుగన్నరేళ్లుగా ఉన్నా లెక్కచేయని వైనం
- జగన్ మార్కు రాజకీయం
- పద్మలత, చందన, విజయ్ వర్గాల్లో అసంతృప్తి
- స్పష్టత లేని మరో మూడు నియోజకవర్గాలు



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం లోక్‌సభ వైసీపీ ఇన్‌చార్జిగా డా.గూడూరి శ్రీనివాస్‌ను అధిష్ఠానం నియమించింది. ఇది మొదటి నుంచి నలుగుతున్న పేరే. వైద్యవృత్తిలో ఉన్న శ్రీనివాస్‌ను తొలుత సిటీ కోఆర్డినేటర్‌గా నియమించారు. సిటీ ఇన్‌చార్జిగా ఎంపీ మార్గాని భరత్‌ను నియమించడంతో ఆయన పరిస్థితి ఏంటని మొదట ఆయన ఆందోళన చెందారు.కానీ ఎంపీ సీటు బీసీ వర్గాలకే ఇస్తారనే స్పష్టత రావడంతో ఆయన పార్టీ పనిలోనే ఉన్నారు. ఆయనతో పాటు శెట్టిబలిజ వర్గం నుంచి డా.అనసూరి పద్మలత, పద్మశాలీవర్గం నుంచి చందన నాగేశ్వర్, యాదవ వర్గం నుంచి బర్ల విజయ టికెట్ ఆశిం చారు. వైసీపీ అధిష్ఠానం గూడూరి శ్రీనివాసనే అభ్యర్థిగా ఖరారు చేసింది. దీంతో ఆయన వర్గంలో ఆనందం వ్యక్తమవుతోంది. రూరల్ కోఆర్డినేటర్‌గా పార్టీని కష్టకాలంలో కాపాడిన చందన నాగేశ్వర్‌కు మొదట రూరల్ సీటు ఇస్తామన్నారు.కానీ మంత్రి చెల్లుబోయిన వేణును రామచంద్రపురం నుంచి ఇక్కడకు బదిలీ చేయడంతో ఆయనను ఆకస్మికంగా మెడపట్టి తోసేసినట్టు అయింది. చివరకు ఎంపీ టికెట్ వస్తుందని కొద్దిరోజులు ఊరించారు.ఇవాళ అదీ పోయింది. దీంతో ఆయన వర్గం తీవ్ర అసం తృప్తితో ఉంది. ఇక డాక్టర్ పద్మలత 2014 నుంచి టికెట్ ఆశిస్తున్నారు. అప్పట్లో ఆమె టీడీపీ టికెట్ ఆశించారు. కానీ బీజేపీతో పొత్తు వల్ల అప్ప ట్లో ఆమెకు అవకాశం దక్కలేదు.తర్వాత వైసీపీలో చేరి పనిచేశారు. ఆమెకే ఎంపీ టికెట్ ఖరారైపోయినట్టు కొద్దిరోజుల కిందట విస్తృతంగా ప్రచారం జరిగింది.చివరకు వైసీపీ మొండిచెయి చూపడంతో పద్మలత వర్గంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మరో అభ్యర్థి యాదవ వర్గం నుంచి బర్ల విజయ్ పేరును వైసీపీ అధిష్ఠానం పరిశీలించింది. జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి కూడా తనకు అవకాశం ఇస్తారని చెప్పినట్టు సోషల్ మీడి యాలో విజయ్ వర్గంప్రచారం చేసింది. ఇవాళ ఆయన వర్గం కూడా అసంతృప్తికి గురైంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానం ఉండగా, ఇప్పటికే నాలుగు అసెంబ్లీ స్థానాలు, ఎంపీ స్థానానికి అభ్యర్థులను వైసీపీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. ఇంకా అన పర్తి, రాజానగరం, నిడదవోలు స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు వైసీపీకి చెందిన వారే. ఎందువల్లనో వారి పేర్లను ఇంకా ప్రకటించకపోవడంతో, జగన్ ఎవరి కొంప ముంచుతారోననే భయం కూడా వారిలో మొదలైంది.

నానో యూరియాపై అవగాహన

నిడదవోలు, ఫిబ్రవరి 2: నానో యూరియా వాడకంతో నేల, నీరు, వాయువుల్లో కాలుష్యాన్ని తగ్గించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు అన్నారు. శుక్రవారం మండలంలోని సమిశ్రగూడెంలో నానో యూరియా పిచికారీపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంటల పెరుగుదలకు నాణ్యమైన దిగుబడులకు నానో యూరియా ఎంతో ఉపయోగపడుతుందని, తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో దీనిని తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పి.చంద్రశేఖర్, ఏవో జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యం

చాగల్లు, ఫిబ్రవరి 2: కొవ్వూరు నియోజకర్గంలో తెలుగుదేశం పార్టీ బీ-ఫారం ఇచ్చిన అభ్యర్థి గెలుపు కోసం ఐక్యంగా పనిచేస్తామని టీడీపీ ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలోని నెలటూరు సీతారామస్వామి కల్యాణ మండపంలో సర్పంచ్ యడ్లపల్లి ఉమారజనితో కలిపి ఆమె భర్త రకారావు, ఎంపీటీసీ సభ్యులు గారపాటి వెంకట నరసింహమూర్తి, టి.గాంధీజీ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కొవ్వూరులో ఆత్మీయ సమావేశం పేరుతో సమావేశం నిర్వహించి పార్టీ జిల్లా అధ్యక్షుడనే గౌరవం లేకుండా విమర్శలు చేయడం దారుణమన్నారు. వర్గాలను ప్రోత్సహించే విధంగా వ్యవహరించడం, ఎమ్మెల్యే టికెట్ ఒకరికి ఇవ్వద్దు అని పేరు పెట్టి చెప్పడం సమంజసం కాదన్నారు. వ్యక్తులు వద్దు, పార్టీయే ముద్దు అని జరగబోయే ఎన్నికల్లో అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. అలాగే తెలుగుదేశం ముద్దు, వర్గాలు వద్దు అనే నినాదంతో జరగబోయే ఎన్నికల్లో పనిచేద్దామని మల్లవరం ఉపసర్పంచ్ కోడూరి కాశిగంగాధరం ఓ ప్రకటనలో అన్నారు.

డీఈవో.. చాగల్లు హైస్కూల్ తనిఖీ



చాగల్లు హైస్కూల్లో డీఈవో అబ్రహాం

చాగల్లు, ఫిబ్రవరి 2: చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో అబ్రహాం శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పేరెంట్ కమిటీ అధ్యక్షుడు ఎం.భగవాన్ మాట్లాడుతూ స్కూల్‌కు రికార్డు అసిస్టెంట్‌ను నియమించాలని, నూతనంగా నిర్మించిన బాలికల జూనియర్ కళాశాలకు గ్రానైట్ రాళ్లు వేయించేలా నిధులు మంజూరు చేయాలని డీఈవో దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో వి.ఖాదర్‌బాబు, హెచ్ఎం పి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల తహశీల్దార్‌గా కృష్ణారావు



నల్లజర్ల, ఫిబ్రవరి 2: నల్లజర్ల తహశీల్దార్‌గా కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సీతానగరం నుంచి బదిలీపై ఆయన నల్లజర్ల వచ్చినట్టు చెప్పారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహశీల్దార్‌గా డీటీ కిషోర్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావుకు వీఆర్వోలు, వీఆర్ఏలు పుష్పగుచ్ఛమిచ్చి అభినందించారు.

ప్రత్యేక హోదాపై దీక్షలో అరుణకుమారి


వైఎస్ షర్మిలతో జిల్లా అధ్యక్షురాలు అరుణకుమారి

పెరవలి, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఢిల్లీలో చేపట్టిన దీక్ష కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైజాగ్‌లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం త్వరగా పూర్తయ్యే విధంగా నిధులు కేటాయించాలని,ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో తనతో పాటు పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణమే 'మానవత' ధ్యేయం

దేవరపల్లి, ఫిబ్రవరి 2: ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత సంస్థ ధ్యేయమని రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పల్లంట్ల జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్, నైతిక విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యతోనే సమాజంలోని పేదరికం, అసమానతలు తొలగిపోతాయన్నారు. ప్రతిభా సాధించిన విద్యార్థులకు షీల్డులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వరలక్ష్మి, జిల్లా మానవత కన్వీనర్ రామలక్ష్మి, ఆచంట సుభాష్‌చంద్రబోస్, కూచిపూడి సత్యనారాయణ, నల్లమాటి లలిత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు చెక్కుల అందజేత


కార్యక్రమంలో మాట్లాడుతున్న హోంమంత్రి వనిత

నల్లజర్ల, ఫిబ్రవరి 2: నల్లజర్ల మండల వ్యాప్తంగా 1621 డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న 16,208 మంది డ్వాక్రా మహిళలకు రూ.15.38 కోట్ల చెక్కులు అందించినట్టు హోంమంత్రి తానేటి వనిత తెలిపారు. శుక్రవారం నల్లజర్ల హైస్కూల్లో జరిగిన ఆసరా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని, తల్లి కడుపులోని బిడ్డ నుంచి వృద్ధురాలి వరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంకా జయలక్ష్మి, గగ్గర శ్రీను, కారుమంచి రమేష్, బంకా అప్పారావు పాల్గొన్నారు.

చివటంలో ఫ్రైడే డ్రైడే

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 2: పరిసరాల్లో నీటి నిల్వలు లేకుంటే దోమలు ఉండవని వెక్టార్ కంట్రోల్ సబ్‌యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సందర్భంగా శుక్రవారం చివటం గ్రామంలో దోమల నివారణకు తీసుకునే చర్యలపై కొన్ని కుటుంబాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైన్లలో చెత్తచెదారాలు వేయడం వల్ల దోమలు పుడుతుంటాయని, దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ వ్యాధులు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కేడీఎల్ కుమారి, సూపర్‌వైజర్లు జె.శ్రీనువాస్, ఏఎన్ఎం సూర్యకుమారి పాల్గొన్నారు. పాలంగిలో జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా స్పర్శ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది జె.శ్రీనివాస్, నాగరాజు, సంధ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో 'జయహో బీసీ'


కార్యక్రమంలో మాట్లాడుతున్న కంఠమణి రామకృష్ణ

తాళ్లపూడి, ఫిబ్రవరి 2: టీడీపీ జయహో బీసీ కార్యక్రమం శుక్రవారం తాళ్లపూడిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దిసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్ విచ్చేశారు. టీడీపీని బలోపేతం చేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి పలు గ్రామాల వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, నాయకులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల బీసీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, ఫిబ్రవరి 2: ఏపీటీఎఫ్ జిల్లా శాఖ జనరల్ కౌన్సిల్ ఈ నెల 4వ తేదీ ఉదయం 10గంటలకు కొవ్వూరులోని హోలీ ఏంజల్స్ హైస్కూల్లో నిర్వహి స్తామని, ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని జిల్లా అధ్యక్షుడున్నా దుర్గారావు ఓ పత్రికటనలో తెలిపారు. శుక్రవారం ఆయన హోలీ ఏంజల్స్ స్కూల్లో ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని మండలాల ఏపీటీఎఫ్ నాయకులు, సభ్యులు, అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఆయన వెంట కొవ్వూరు రూరల్ జనరల్ సెక్రటరీ సలాం, టౌన్ గౌరవాధ్యక్షుడు జానీ ఉన్నారు.

కేంద్రం నిధులతోనే ఆర్వోబీ నిర్మాణం


నిడదవోలులో రైల్వే పార్టు పూర్తయిన బ్రిడ్జిని చూపుతున్న శేషారావు

- వైసీపీ ఎన్నికల హామీ అమలు అనడం హాస్యాస్పదం
- మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు, ఫిబ్రవరి 2: ఆర్వోబీ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదని కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మాణం ప్రారంభమైందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. శుక్రవారం నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఆర్వోబీ నిర్మాణమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అనడం హాస్యాస్పదమని అన్నారు. ఇప్పటికే పూర్తయిన ఆర్వోబీలోని రైల్వే పార్టు వారి కళ్లకు కనిపించడం లేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఆర్వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ విడుదల చేసిన జీవో ప్రకారమే ఇప్పటికీ ఆర్వోబీ నిర్మాణం జరుగుతుందన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో ఆర్వోబీ నిర్మాణ పనులు వైసీపీ ప్రభుత్వం ఆపేసిందని, తిరిగి టెండర్ పిలవడానికి నాలుగున్నరేళ్లు పట్టిందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఎవరైనా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవాలి అనుకుంటే వచ్చి మిమ్మల్ని(ఎమ్మెల్యే) కలిస్తేనే అనుమతులు వస్తాయని, దానికి కారణం ప్రజలందరికీ తెలుసునని విమర్శించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడుకు ప్రెస్ అంటే భయమని, కార్యక్రమాలు కవర్ చేసేందుకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు వస్తే ఫొటోలు, వీడియోలు తీయనివ్వరని, ఎమ్మెల్యేగా ఆయన ఏ తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఆయన అండదండలతో కాకరపర్రులో ఇప్పటికీ మట్టి, ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. అనంతరం నెహ్రూ బొమ్మ సెంటరులో నిర్మాణం పూర్తయిన ఆర్వోబీలోని ముఖ్యభాగమైన రైల్వే పార్టును శేషారావు సందర్శించారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆర్వోబీకి ఎమ్మెల్యే చేసిందేమీ లేదు : సీపీఎం

నిడదవోలులో ఆర్వోబీ నిర్మాణానికి ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు చేసిందేమీ లేదని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు విమర్శించారు. శుక్రవారం నిడదవోలులో ఆయన మాట్లాడుతూ అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆర్వోబీ మంజూరైందని, అందుకు అప్పటి ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఎంతో కృషి చేశారన్నారు. ఆర్వోబీ నిర్మాణం ఎప్పుడో పూర్తి కావాలని, రాజకీయ ప్రతీకార చర్యల్లో భాగంగానే వైసీపీ ప్రభుత్వం ఆర్వోబీ నిర్మాణం జరుగకుండా అడ్డుపడిందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతో ప్రారంభమైన ఆర్వోబీ నిర్మాణానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు భూమి పూజ చేయడంపై ప్రజలంతా నవ్వుకొంటున్నారని రాంబాబు అన్నారు.

ఆర్వోబీకి భూమి పూజ

నిడదవోలులోని నెహ్రూ బొమ్మ సెంటరులో ఆర్వోబీ నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు భూమి పూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం సేతుబంధన్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయగా ఆర్ఆర్ఆర్ కనస్ట్రక్షన్స్ కంపెనీ పనులను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిడదవోలు ప్రజల చిరకాల కల నెరవేరిందని, గత ఎన్నికల్లో ఆర్వోబీ నిర్మిస్తామని ప్రజలకు ఇచ్చిన హామీ ఇప్పుడు నిర్మాణ పనులకు బాటలు వేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, ఆర్ఆర్ఆర్ కనస్ట్రక్షన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం

- డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్‌కుమార్‌రెడ్డి
- కేఎల్ఆర్ లెనోరా దంతవైద్య కళాశాలలో రాష్ట్ర సదస్సు


కళాశాల చైర్ పర్సన్ నాగమణిని సత్కరిస్తున్న సతీష్‌కుమార్ రెడ్డి

రాజానగరం, జనవరి 2: దంతాలను సంరక్షించుకోవడం ద్వారా ప్రతి మనిషికి సంపూర్ణ శరీర ఆరోగ్యం చేకూరుతుందని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సతీష్‌కుమార్ రెడ్డి అన్నారు. ఇండియన్ ప్రోస్థొడాంటిక్ సొసైటీ(కృత్రిమ దంతాల విభాగం)ఏపీ శాఖ ఆధ్వర్యంలో రాజానగరంలోని కేఎల్ఆర్ లెనోరా దంతవైద్య కళాశాలలో రెండు రోజులపాటు జరిగే రాష్ట్ర స్థాయి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపూర్ణ శరీర ఆరోగ్యానికి ఆరోగ్యకరమైన దంతాల దోహదపడతాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రతిరోజు దంతాలను శుభ్రం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సదస్సులో ప్రపంచ, జాతీయ స్థాయి నిష్ణాతులైన వైద్య నిపుణులు దంత వైద్య రంగంలో వస్తున్న ఆధునిక వైద్య విధానాలు, చికిత్సా పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే 65 సైంటిఫిక్ పేపర్లను ఫ్యాకల్టీ మెంబర్లు, పీజీ విద్యార్థులు సమర్పించారు. కార్యక్రమంలో కెఎల్ఆర్ గ్రూపు విద్యాసంస్థల అధినేత్రి నాగమణి, కార్యదర్శి వై.మధుసూదనరెడ్డి, ఐపీఎస్ కార్యదర్శి డాక్టర జంగాల హరి, సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఐపీఎస్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్, కార్యదర్శి డాక్టర్ శేషారెడ్డి, లెనోరా దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వప్రకాష్ శెట్టి, సదస్సు నిర్వాహకులు టీఎస్‌వీ సత్యనారాయణ, డాక్టర్ సుధీర్ కొండక, వివిధ రాష్ట్రాలకు చెందిన 215 మందికి పైగా ప్రోస్థొడాంటిక్ నిపుణులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు సీఎం సభకు
300 ఆర్టీసీ బస్సులు



- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి తరలింపు
- నేడు ప్రయాణికులకు ఇక్కట్లు తప్పని పరిస్థితి
- ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు 600 పైనే ?

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2: ముఖ్యమంత్రి ఏలూరు పర్యటన ఆర్టీసీ ప్రయాణికులకు కష్టాలు తెచ్చిపెట్టనుంది. శనివారం జరిగే సీఎం సభ కోసం జనాలను తరలించడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఏలూరు పంపిస్తుండగా, వీటిలో పల్లెవెలుగు బస్సులే అధికంగా ఉన్నాయని చెబుతున్నారు. దీంతో పల్లె ప్రజానీకం ప్రయాణ అవసరాల కోసం నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యమంత్రి సభకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 300కు పైగా ఆర్టీసీ బస్సులను ఏలూరు పంపిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి 90కి పైగా బస్సులు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం బస్సులు దాదాపుగా 300 వరకూ ఉన్నాయి. వీటిలో 90కి పైగా బస్సులు ఏలూరు పంపడంతో ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవనే చెప్పాలి. అలాగే కాకినాడ జిల్లా నుంచి సుమారు 90, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 100కి పైగా బస్సులు సీఎం సభకు పంపిస్తున్నారు. ఇలా పెద్దసంఖ్యలో బస్సులను ఏర్పాటు చేయాల్సి రావడంతో మూడు జిల్లాల ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. బస్సుల కోసం ప్రయాణీకులు నిలదీస్తే ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదని కొందరు ఆర్టీసీ అధికారులు అంతర్గత చర్చల్లో వాపోతున్నారని సమాచారం.

నేడు ఇంటర్ పరీక్ష వాయిదా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఈ రోజు(శనివారం) జరగాల్సిన ఇంటర్ మొదటి ఏడాది పర్యావరణ విద్య పరీక్షను ఈ నెల 23న నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరశింహం తెలిపారు. 2న జరిగిన నైతికత మానవీయ విలువలు పరీక్షకు 21,195 మంది హాజరు కాగా 168 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 5 నుంచి 20 వరకూ.. జనరల్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ఈ నెల 11 నుంచి 20 వరకూ ప్రాక్టికల్స్ పరీక్షలు 76 సెంటర్లలో జరుగుతాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని.. విద్యార్థులు అందరూ తమ సెషన్లలో హాజరు కావాలని ఇంటర్ బోర్డు జోన్-1,2 ఆర్‌జేడీ ఐ.శారద కోరారు.

ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు కూడా...

ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను భారీ సంఖ్యలో సీఎం సభకు తరలించడానికి రంగం సిద్ధం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రముఖ ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన సుమారు 600కు పైగా బస్సులు చలో ఏలూరు నడుపుతున్నారని చెబుతున్నారు. దీంతో సీఎం సభ అంటేనే అటు ఆర్టీసీ అధికారులు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటుండగా, ఇటు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

కలెక్టర్ వస్తున్నారని ఖాళీ చేసేశారు!

నిర్మానుష్యంగా మారిన బల్లిపాడు ఇసుక ర్యాంప్

తాళ్లపూడి, ఫిబ్రవరి 2: మండలంలోని బల్లిపాడు ఓపెన్ ఇసుక రీచ్ నిత్యం రద్దీగా ఉండేది. అయితే శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఖాళీగా దర్శనమిచ్చింది. అప్పటికప్పుడే రీచ్‌లోని మిషన్లు, లోడింగ్ యంత్రాలు, లారీలు, ఎక్కడివి అక్కడే ఏదో మంత్ర వేసినట్టు హఠాత్తుగా మాయమయ్యాయి. లోడింగ్ చేసిన ఇసుకను సైతం కింద పోసేసి లారీలను ఖాళీగా ర్యాంప్ నుంచి పంపివేశారు. అంతే కాదు అక్కడ పనిచేసే సిబ్బంది సైతం ఒక్కరు కూడా లేకుండా వెళ్లిపోయారు. మిషన్లు, బాట తడిపే ట్యాంకులు పక్కనే ఉన్న చెట్లలో దాచేశారు. ర్యాంపు చూసిన స్థానికుల్లో హఠాత్తుగా ఇసుక రీచ్ మూసి వేయడానికి గల కారణాలు ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే సాయంత్రం జిల్లా కలెక్టరు మాధవీలత బల్లిపాడు ఓపెన్ రీచ్‌లో పర్యటించారు.


ర్యాంపులో పర్యటిస్తున్న కలెక్టర్


నిర్మానుష్యంగా ఉన్న బల్లిపాడు ఇసుక ర్యాంపు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా ఐదు హెక్టార్లకు మించి కన్నా పెద్ద రీచ్‌లు ఉన్నాయా? ఇసుక పరిమాణాన్ని పెంచడానికి అవసరమైన పరిస్థితులు ఉన్నాయా లేదా అని పరిశీలించేందుకు పర్యటిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకూ 13రీచ్‌లు పరిశీలించామన్నారు. కలెక్టరుతో పాటు మైనింగ్, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కాగా బల్లిపాడు ర్యాంప్‌ను ఖాళీగా చేయడానికి కారణం కలెక్టర్ పర్యటనేనని, కలెక్టర్ వస్తున్నారని అధికారుల్లో ఎవరో సమాచారం ఇవ్వడం వల్లనే లారీలను పంపించేసి, మిషన్లు, వాటర్ ట్యాంకులు దాచేశారని, సిబ్బంది పారిపోయారని గ్రామస్థులు అనుకుంటున్నారు.

కెనాల్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు

బిక్కవోలు, ఫిబ్రవరి 2: అనపర్తి కెనాల్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ములగపాటి శివరామకృష్ణంరాజు ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు లేఖ రాశారు. ఈ లేఖను ఆయన శుక్రవారం విలేకర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ఏం జరిగినా సొంత డబ్బా కొట్టుకుని, ఢిల్లీ నుంచి పత్రికా ప్రకటనలు చేయడం తప్ప ఎంపీ నిధులతో నియోజకవర్గంలో చేసిందేమీ లేదన్నారు. త్వరలో ఎన్నికలు రానున్న దృష్ట్యా కెనాల్ రోడ్డుకు శాశ్వత పరిష్కారంతో పాటు, రంగంపేట ఏడీబీ రోడ్డులో నివాసం కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారంపై దృష్టి సారించాలని ఎంపీకి లేఖ రాసానన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజమహేంద్రవరం ఎంపీ సీటును బీజేపీ గెల్చుకోవడం ఖాయమని శివరామకృష్ణంరాజు పేర్కొన్నారు.

రాజకీయంగా గౌడలకు ప్రాధాన్యమివ్వాలి

గౌడ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృపారావు



కొవ్వూరు, ఫిబ్రవరి 2: రాజకీయంగా గౌడలకు ప్రాధాన్యమివ్వాలని, సముచిత స్థానాల్లో పదవులు కల్పించాలని గౌడ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తాతా కృపారావు కోరారు. కృపారావును వైసీపీ కొవ్వూరు ఇన్‌చార్జి తలారి వెంకట్రావు శుక్రవారం కొవ్వూరులోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తలారిని ఆయన సత్కరించి నియోజకవర్గంలోని గౌడ సామాజిక వర్గ పరిస్థితులను వివరించారు. అలాగే తలారి మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని, గౌడ సామాజిక వర్గానికి శాసన సభా స్థానాల్లో పెద్దపీట వేశారని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, నియోజక వర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ, బావన రత్నకుమారి, కంఠమణి రమేష్, ఉప్పులూరి సూరిబాబు, జెడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, మారిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో 'నన్నయ' విద్యార్థికి కాంస్యం


పతక విజేత కోటేశ్వరరావును అభినందిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి: అఖిల భారత వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థి ఈ.కోటేశ్వరరావు మూడో స్థానం సాధించి కాంస్య పతకం కైవసం చేసుకున్నట్టు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. యూనివర్శిటీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చండీఘడ్ విశ్వవిద్యాలయంలో గత నెల 26నుంచి 29వరకూ జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో 55 కిలోల కేటగిరిలో కోటేశ్వరరావు ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించారన్నారు. ఇటీవల నన్నయ వర్శిటీలో నిర్వహించిన సౌత్‌వెస్ట్‌జోన్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో అర్హత సాధించిన ముగ్గురు విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా కోటేశ్వరరావు మూడో, జె.మధుబాబు నాలుగో స్థానంలో నిలిచారన్నారు. వీఆర్ కళాశాలలో చదువుతున్న ఈ ఇద్దరూ అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే ఖేలో ఇండియా క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, క్రీడాబోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, కోచ్ టి.శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా ఎలా తొలగించారు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి

బిక్కవోలు, ఫిబ్రవరి 2: కొమరిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం పేరుతో 150 ఏళ్ల వయస్సున్న చెట్టును అనుమతులు లేకుండా ఎలా తొలగించారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. కొమరిపాలెంలో ప్రభుత్వ నిధులు రూ.33 లక్షలతో మెయిన్‌రోడ్డును సీసీ రోడ్డుగా మారుస్తున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ రోడ్డులో విద్యుత్ స్తంభాల మార్పు పేరుతో రోడ్డు పక్కన వున్న నివాసితుల నుంచి సొమ్ములు వసూలు చేయడం అన్యాయమన్నారు. అలాగే రోడ్డు ప్రక్కన వున్న చెట్టును ఎటువంటి అనుమతులు లేకుండా తొలగించారని దీనిపై అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసిక, శారీరక వికాసం

బిక్కవోలు, ఫిబ్రవరి 2: క్రీడల ద్వారా మానసిక, శారీరక వికాసం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంకల్పం లైఫ్ స్కిల్ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా స్కూల్ ఫెసిలిటీ అబ్జర్వర్ డి.డానియల్ తెలిపారు. పందలపాక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సంకల్పం లైఫ్ స్కిల్ ప్రోగ్రాంను శుక్రవారం ఆయన పరిశీలించారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీడీ యువరాజారెడ్డి, ఎస్ఎస్ ఉపాధ్యాయుడు వీర్రెడ్డిల సహకారంతో పాఠశాలలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను ఈ కార్యక్రమం ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. లీడర్ గేమ్స్ ఆడించి వాటి ద్వారా పొందిన అనుభూతిని ప్రశ్నల ద్వారా తెలుసుకుని ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.

మెనూ ఛార్జీలు పెంచాలి

సీఐటీయూ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా



దేవరపల్లి ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

దేవరపల్లి, ఫిబ్రవరి 2: పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెనూ ఛార్జీలను పెంచాలంటూ సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరపల్లి ఎంఈవో కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన పథక యూనియన్ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.భగత్ మాట్లాడుతూ బిల్లులు సక్రమంగా రాకపోవడం వల్ల మధ్యాహ్న పథక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వేతనం రూ.10 వేలు ఇస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వంటలు చేయడానికి అనువైన వంటపాత్రలు లేక ఇబ్బందులుపడుతున్నారని, ప్రమాద బీమా కల్పించాలని, పదవీ విరమణ సౌకర్యం కల్పించాలన్నారు. కార్య క్రమంలో దుగ్గిన రత్నమాణిక్యం, కె.రాజకుమారి, ఎండీ రజాని, ఎం.నాగ సుబ్బలక్ష్మి, ఎం.రాణి, ప్రత్తిపాటి కుమారి, సుజాత, కె.రత్నాజీ పాల్గొన్నారు.

వేలివెన్నులో 'ఆరోగ్య సురక్ష'

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 2: అందరికీ ఆరోగ్య సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వేలివెన్ను గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురు రోగులకు వైద్యులు, ఈజీసీ, షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడి సహాయంపై అవగాహన కలిగించాలి

కొవ్వూరు, ఫిబ్రవరి 2: ప్రతి రైతు ఇంటికీ వెళ్లి పశువులకు టీకాలు వేస్తూ రైతులకు పెట్టుబడి సహాయం కింద షార్ట్ టర్మ్ లోన్స్, పశు కిసాన్ క్రెడిట్ కార్డులపై అవగాహన కలిగించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఎస్‌జీటీ సత్యగోవింద్ చెప్పారు. కొవ్వూరు ఏరియా వెటర్నరీ హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన విచ్చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి పాడి రైతుకి రూ.30 వేల రుణం ఇస్తారని, ఈ రుణానికి 7శాతం వడ్డీలో 3శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించాలన్నారు. ఇప్పటివరకూ పశువులకు గాలి నిరోధక టీకాలు వేయడంలో 95శాతానికి పైబడి పూర్తి చేశామని సత్యగోవింద్ చెప్పారు.

కడియం ఎంపీడీవోగా రాజ్‌మనోజ్

కడియం, ఫిబ్రవరి 2: కడియం ఎంపీడీవోగా జి.రాజ్‌మనోజ్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో కె.రత్నకుమారి కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం నుంచి రాజ్‌మనోజ్ కడియం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ పరిపాలనాధికారి కె.చంద్రరావు, ఉద్యోగులు పూలమొక్కను అందజేసి స్వాగతించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	గుంటూరుకారం
వై.స్క్రీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్